కీర్తనలు

# ముకుందమాల



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాన్ని గీతా దీక్ష వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో భాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. దీనిద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) గీతా దీక్ష వారి వెబ్ సైట్: http://geetadeeksha.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో గీతా దీక్ష వారి వెబ్ సైట్ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline: 9042020123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## గీతా దీక్ష వారి వెబ్ సైట్:

## http://www.geetadeeksha.com



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖



మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014



# ముకుందమాల

(కులశేఖర ఆళ్వార్)

(సంస్కృత మూలం)


తెలుగుపద్య అనువాదం :

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

M.Tech



## సతీ సమేత అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు


Address :

Flat No.5; Plot 61,

Siddardha Apartments,

Siddardha Nagar,

Hyderabad - 500 038, A.P, India

E-Mail : deekshitulu_a@yhaoo.com

Mobile : 9393021360

Website: http://www.geetadeeksha.com/

శుభమస్తు ॐ అవిఘ్నమస్తు



# ముకుందమాల

(కులశేఖర అళ్వార్)

(సంస్కృత మూలం)

తెలుగుపద్య అనువాదం :
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech



## ముకుందమాల

మొదటి ప్రచురణ

ఏప్రిల్ 2008

రచన
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.

వెల : అమూల్యం

ప్రతులకు :
ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం.61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 040-23814379

డి.టి.పి. & ప్రింటింగ్ :
కె. మురళీ కృష్ణ
9848515109



## అంకితము

కం॥ సుందర చైతన్యునికా
నందునకిది అంకితమ్ము నయముగ నిత్తున్
డెందము పులకించంగ, ము
కుందుని మాలనెడి దీని కుదిరిన భక్తిన్.

తా॥ శ్రీ సుందర చైతన్యానంద స్వామికి ఈ ముకుందమాల అనెడి దీనిని మనస్సు పులకించగా సద్భక్తితో అంకితం ఇస్తున్నాను. ఇది వరలో ఆయన వ్రాసిన రచనలు నేను పద్యములలో వ్రాసి ఋణం తీర్చుకుంటున్నాను. స్వామి కరుణ నాపై సదా నిలుచుగాక!



## పీఠిక

శ్లో॥ గోవింద సుందరపదాంబుజ మగ్నచిత్తో
1 మందాకినీతులిత మంజులవాక్ప్రవృత్యా
లోకం సమస్త మకరోదవధూత పాపం
తంవేంకటాఖ్య గురుమాత్మని భావయామః
– శ్రీ మొవ్వ దాశరథి సూరి

శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్య
2 మమేకం శరణం వ్రజ
అహంత్వా సర్వపాపేభ్యో
మోక్షయిష్యామి మాశుచః
– శ్రీమత్భగవద్గీత

జన్మలలో కెల్ల మానవ జన్మ చాల ఉత్తమమే గాక ఎంతో పుణ్యము చేసినగాని లభించదు. అలాంటి

ఉత్తమ జన్మ పొందినందుకు సార్థకత లోకోపయోగ కార్యములు చేసినప్పుడే, లోకోపయోగ కార్యములు దైవసంబంధమైతే మరింత సార్థకత. మానవుడు పారమార్థిక విషయములయందు ప్రవేశించాలి అంటే ఎంతో పూర్వజన్మ సుకృతియై ఉండాలి.

**శ్లో॥ జన్మాంతర సహస్రేషు తపోధ్యాన సమాధిభిః**
**నరాణాం క్షీణపాపానాం కృష్ణే భక్తి ప్రజాయతే.**

అనేక జన్మలలో చేసిన తపస్సు, ధ్యానము, సమాధి మొదలగు వానివలన ఈ జన్మలో మానవులకు కృష్ణునియందు భక్తి కలుగును అని చెప్పబడినది అనగా భక్తి మార్గములో చేరుట సుదుర్లభము పూర్వజన్మ సుకృతి లేనివానికి.



## ముకుందమాల

ముకుందస్యమాలా. మోక్ష ప్రదుడగు ముకుందునికి మాల యని అర్థము. ఈ ముకుందమాల నలువది శ్లోకములలో అలరారుచున్న గొప్ప గ్రంథము. దీనిని కులశేఖరాళ్వారు రచించిరి. ఆయన జన్మతహ క్షత్రియుడు. రాజ్యము చేయుచు ఇహపరములను సాధించిన రాజేంద్రుడు ఆయన. సాధారణముగ రాజులు మదాంధులై చరింతురు. దానికి భిన్నముగ ఆయన వినమ్రుడై పారమార్థిక చింతనతో వైష్ణవుడై ఈ ముకుందమాల వ్రాసి కృష్ణభగవానుని కీర్తించి తాను తరించి యితరులను తరింపజేయుచున్నాడు. వీరు పన్నిద్దరాళ్వారులలో ఒకరుగా చేరిరి. ఈ గ్రంథము పారాయణ గ్రంథములయిన విష్ణు సహస్రనామము, భగవద్గీత మొదలగు వాని సరసన చేరినది. ఈ విధముగా పారాయణ గ్రంథములలో చేరినది అనగా



దానియొక్క ఔన్నత్యమును వేరుగా చెప్పవలసిన పనిలేదు. భాగవతమును తెనుగించి పోతనగారు దాని అంకితవిషయమై శ్రీనాధుని సలహాను తిరస్కరించి శ్రీరామునికే అంకితమిచ్చి శాశ్వత కీర్తుడై, పవిత్రుడై, భగవద్భక్తుడై అమూల్యమైన పద్యరత్నములను వ్రాసి తను తరించి లోకమును తరింప జేయుచున్నాడు. ఈ సందర్భముగా ఆయన జెప్పిన ఒకపద్యమును మననము చేయుట చాల సబబు.

ఉ॥ ఇమ్మను జేశ్వరాధములకిచ్చి పురంబులు
వాహనంబులున్
సొమ్ములుఁ గొన్ని పుచ్చుకొని సొక్కి
శరీరముఁబాసికాలుచే
సమ్మెట వాటులంబడక సమ్మతి శ్రీహరి
కిచ్చి చెప్పెనీ
బమ్మెర పోతరా జొకడు భాగవతంబు
జగద్ధితంబుగన్



ముకుందమాల పారాయణ గ్రంథము. భగవద్గీత పారాయణము జేయవలెనన్న 18 అధ్యాయములతో 701 శ్లోకముల నిడివి కల్గి ఉన్నది. ఇతర స్తోత్రముల వలె మరియు చిన్నదిగా కాక 40 శ్లోకములతో 10 నుండి 15 నిమిషములలో పారాయణ జేయవచ్చును. ఆది శంకరులు చెప్పినట్లుగా.

“గేయం గీతానామసహస్రం” అన్నట్లుగా “గేయం ముకుందమాల” అనవచ్చును. ఏ గ్రంథమైనను గొప్పదిగా చెప్పవలెనంటే 1. ప్రతిపాదించిన వస్తువు గొప్పదియై ఉండాలి. 2. చెప్పే వ్యక్తి గొప్పవాడై ఉండాలి. ఇచ్చట ప్రతిపాదించబడిన వస్తువు శ్రీమన్నారాయణునిగూర్చి. అందుచే జగత్ప్రసిద్ధమైనదీ ముకుందమాల చెప్పినటువంటి వ్యక్తి అమరవాది సుబ్రహ్మణ్యదీక్షితులుగారు. వారు ఇంజనీరింగులో **M.Tech** చేసి ఇహమును జయించినను పరమును

పొందుటకు కావలసిన వస్తువుల సేకరణ వాని వినియోగమును ప్రస్తుతము జేయుచున్నారు. పూర్వకవి చెప్పినట్లుగా "ఇహమును సాధింప హేమ విద్యేవిద్యపరమును సాధింప బ్రహ్మవిద్య". శ్రీ దీక్షితులుగారు ఇహమును పరిపూర్ణముగ సాధించిన పిదప త్యజించి (రిటైర్‌మెంట్ తరువాత) పరమువైపు అతిజాగరూకులై సమయము వృధాకాకుండా ఇలా ఎన్నో రచనలకు అదియు చంధోబద్ధముగా గొప్ప కావ్యములను తెనుగించుట వారి పూర్వ జన్మ సుకృతము. మొదటి నుండి వీరు వైదిక కర్మలందు నిష్ణాతులే. ఆదినుండియు సంగీత, సాహిత్యములందు గూడా ప్రవేశము పొంది యున్నారు. పారమార్థిక దృష్టి, మొదటినుండియు కలదు.

**రచనా శైలి :** దీక్షితులుగారు చాల సరళమైన భాషతో సామాన్యునికి కూడా అర్థమయ్యేలా తెనిగించిరి. ప్రార్థన తొమ్మిది పద్యాలుకల్గి ఉన్నది. ఇవి యాదృచ్ఛికమో లేక



అలా వ్రాయాలని తొమ్మిది వ్రాసినారో. తొమ్మిది సంఖ్య జీవసంఖ్య. భగవద్గీతలో స్వామి తొమ్మిది సంఖ్య నేనే అని చెబుతారు. తొమ్మిది నంబరును ఎన్నిసార్లు ఏ నెంబరుతో హెచ్చించినను చివరికి దాని విలువ తొమ్మిదే వచ్చును. ఏలనన.

| | | | | |
|---|---|---|---|---|
| **9 x 2** | **=** | **18** | **=** | **1 + 8 = 9** |
| **9 x 3** | **=** | **27** | **=** | **2 + 7 = 9** |
| **9 x 4** | **=** | **36** | **=** | **3 + 6 = 9** |
| **9 x 100** | **=** | **900** | **=** | **9 + 0 + 0 = 9** |

ఇలా ఎంత దూరము పోయినను
చివరకు వచ్చు విలువ '9' మాత్రమే.

ప్రార్థన స్వామివారి సంఖ్యతో ఉండుట విశేషము. ప్రతి శ్లోకానికి అవతారిక వ్రాయుట ఇక్కడ విశేషము. అంతేకాక ప్రతి శ్లోకానికి ఒక పద్యము, తాత్పర్యము వ్రాసిరి. ఈ రచన బహుళ జనోపయోగకరమై



ఇహమును, పరమును ప్రసాదించుగాక. చివరగా శ్రీ దీక్షితులుగారికి వారి సతీమణికి వారి పుత్రులు, పౌత్రులకు శ్రీశుడు ఆయురారోగ్య ఐశ్వర్యములు సకల విద్యలు ప్రసాదించుగాక.

శ్రీ దీక్షితులుగారు ఇలాంటి రచనలు మరెన్నో చేయాలని ఆకాంక్షిస్తూ

"సర్వేజనా సుఖినోభవంతు"

ఇట్లు
భక్తపాద రేణువు
**మొవ్వదేవనాథ సూరి**
**F.C.A.**

**శ్లో॥ నాహం వసామి వైకుంఠే**
**నయోగి హృదయయేరహే**
**మద్భక్త యత్రగాయంతి**
**తత్రతిష్ఠామినారాదా.**

-బ్రహ్మాండ పురాణం



## ముందు మాట

షడ్రుచులతో విందు ఆరగించారంటారు. ఈ షడ్రుచులు ఏమిటి? తీపి, కారం, ఉప్పు, పులుపు, చేదు మరియు వగరు. మనకి ఈ రుచులు అన్నీ కావాలి కాని సమపాళ్ళలో కావాలి. చేదు, వగరు వంటి రుచులు మనకి ప్రకృతి ఇచ్చిన వైవిధ్యం కాబట్టి వాటిని ఇష్టపూర్వకంగా తీసుకోకపోయినా ప్రకృతి ప్రసాదించిన ఔషధాల ద్వారా తీసుకుని ఆ రుచులను సహిస్తున్నాం. మిగిలిన నాలుగు మనం నిత్యం ఆహారంలో తీసుకుంటూనే వున్నాము. శరీరాన్ని (జిహ్వని) రంజింప చేసేవి ఈ రుచులయితే మనస్సుని రంజింప చేసేవి నవరసాలు.

ఏ కావ్యానికైనా ఆభరణాలు ఈ నవరసాలే. హాస్యరసం ఆబాల వృద్ధులకు ఆనందదాయకం. శృంగారం యౌవనులకు ఆనంద దాయకం. అలాగే రౌద్ర, భీభత్స, భక్తి, వైరాగ్య, విషాద, జుగుప్స,

భయానక రసాలు కావ్య పుష్టికి అవసరమే. మానవునికి అన్నీ జీవితంలో ఏదో ఒకప్పుడు అనుభవమై హృదయాన్ని ఆ అనుభవంలో ప్రతిస్పందించి మనిషి తనని తను మరచిపోతాడు. నాటకం అందుకే సర్వజనాదరణీయం అయింది.

కావ్యం విద్యనేర్చిన వారి కాలంబనమై అలరించి ఎన్నో గ్రంధాలు ఆవిష్కరింపబడటానికి కారణమైంది. హాస్యరసంతో ఎంతోమంది రచయితలు ఆనందం కలుగజేశారు. శృంగార కావ్యాలు కుప్పలు తెప్పలుగా వెలుగులోకి వచ్చాయి. భక్తి కావ్యాలు మనిషిని సన్మార్గంలో వుంచి దుర్మార్గం హద్దు మీరకుండా అడ్డుకొన్నాయి.

స్థిర భక్తి పర్యవసానం వైరాగ్యం. ఒక్కసారి గతించిన జీవితాన్ని అవలోకిస్తే మనిషి తనెంత వెర్రివాడోనని ఆశ్చర్యపోయి తనమీద తనే జాలి



పడతాడు. చిన్న పాప తను అమ్మలాగా నటిస్తూ ఆడుకుని లక్క పిడతల్లో వంటచేసినట్లు ఆడుకుంటుంది. పెద్దదయ్యాక అలా చేయదు ఎందుకని? దానికి అనుభవం వచ్చి ఇంతకాలం తన ఆటలు నిజం కావని తెలుసుకుని ఆపైన నిజం ఏమిటో తెలుసుకుని జ్ఞానం కలిగి అజ్ఞానం పోయి ఎలా నడుచుకోవాలో అలా నడుచు కుంటుంది.

కాని పెద్దయ్యాక ఇంకొక ఆటలో పడి జీవితం సాగిస్తూ, సుఖదుఃఖాలు అనుభవిస్తూ జీవన సాగరంలో ఆటుపోట్లు అనుభవిస్తుంది. విషాదం ఎదురవనంత సేపు ఆమాయలోంచి మనిషి బైటపడలేడు.

కం॥ అనుకొన్నది కాదాయెను
అనుకోనివి అన్ని జరిగి అగచాట్లవుగా
అనుకోకుండా ఉండను
అనుకొన్నా కాకనున్న అయ్యే దయ్యేన్.



కొంచెం తికమకగా వున్నా ఈ పద్యం అర్థం ఒక్కమాటతో ఏమిటంటే "మనకిష్టం ఉన్నా లేకపోయినా జరిగేది తప్పక జరుగుతుంది" అని.

ఎందుకంటే అట్లా జరుగును గాక అని నిర్దేశించింది. వేరెవరో కాదు, ఆది మధ్యాంత రహితుడైన జగత్పిత, జగత్పతి అయిన ఆ పరమాత్మ. ఆయనను శ్రీమహావిష్ణువని ఒకరు పిలిస్తే, పరమేశ్వరుడు అని ఇంకొకరంటే, జగన్మాత అని ఇంకొకరన్నారు. రకరకాలుగా వారి కథలు లీలలు వర్ణించారు. వారి భక్తుల కథలు కూడా రసోపేతమైన కావ్యాలయ్యాయి. ఒకప్పుడు పుష్టిగా తిని ఎంత దూరమైనా నడిచిపోయి కాయకష్టం చేసి శరీరం అలసిపోయి కంటినిండా నిద్రపోయి 'మాయరోగా' లేమీ లేకుండ జీవించి క్రమంగా వృద్ధాప్యంవల్ల శరీరం జీర్ణించి మరణించేవారు.



నేడు ఇంట్లోంచి కాలు బైటపెడుతూనే 'వాహనం' ఎక్కి తినవలసినది తినకుండా, తినకూడనిది తింటూ చేయవలసినది చేయకుండా చేయ కూడనిది చేస్తూ, మాట్లాడవలసింది మాట్లాడక, మాట్లాడకూడనిది మాట్లాడుతూ ఆలోచించాల్సింది ఆలోచించకుండా ఆలోచించకూడనిది ఆలోచిస్తూ రెండేళ్ళ పాపాయి 'పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతుంటే మురిసిపోతున్నాం. జేబులో డబ్బు దొంతర్లుంటే చాలనుకున్నాం. ఆలోచించండి రూపాయి నోటుమీద 1000 అంకెవేస్తె అది వెయ్యి రూపాయలవుతుందా? వెయ్యి రూపాయల సరుకులు కొనగలిగితే అవుతుంది.

మన చిన్నారి వంశాంకురం మన కళ్ళముందే వైద్యులే ఇదమిద్ధంగా చెప్పలేని (వంద పరీక్షలు చేశాక) రోగంతో బాధ పడుతుంటే, నవరత్నాలు ధరించి ఏం చేసుకుంటారు? బంగారు మంచంమీద పడుకుంటే

నిద్రపడుతుందా 'లంకంత కొంపలో' పడుకుంటే నిద్రపడుతుందా? లక్ష రూపాయల 'విలువ' గల దుస్తులు ధరిస్తే నిద్రపడుతుందా. పట్టదు గాక పట్టదు. మళ్ళీ నాగరికతా చక్రం ఒకచుట్టు తిరిగి సుఖం అంటే శారీరక సుఖం కాదని 'ఆత్మసుఖం' అని తెలుసుకున్న రోజున 'యోగా' క్లాసులక్కర లేదు జీవన సరళిలో మార్పు చేసుకుంటే చాలు.

ఇది ఎవరికి వారే సాధించాలి. ఆనందం ఎక్కడో లేదు. మనలోనే వుంది. మన చేతిలో ఉన్న మాణిక్యం బురద అంటి వుంది. ఆ బురద కడిగి మాణిక్యాన్ని చూడలేక అది మట్టి బెడ్డ అనుకుంటున్నాము. ఇక ఈ చర్చ ఆపి....

అసలు విషయానికి వద్దాం. వైరాగ్య భావనతో మనసు ప్రశాంతంగా వుంచుకొని దైవధ్యానంతో గడపాలని తెలుసుకున్నాక అవి సాధించటానికి



మహానుభావుల అనుభవాలు తెలుసుకొని, వారెలా సాధించారో ఆ విధంగా పరమాత్మపై భక్తి సాధించి సన్మార్గంలో జీవితం 'పండించుకోవాలి'. ఆ ప్రయత్నం భగవత్కృప ఉండి వైరాగ్యం వల్ల మాత్రమే సాధించగలం.

నా మనస్సు, జీవితం చిట్ట చివరి అంకంలో ఆ పరంధాముని కృపవల్ల నారాయణునిపై లగ్నమైంది. ఎక్కడినుంచి వచ్చిందో ఏ జన్మలో నా ఆత్మ అనుభవించిందో కాని పద్యం చెప్పగల శక్తి వచ్చింది. దాంతో ఆ స్వామి నారాధిస్తున్నాను.

కంII బల్లిదుని ఆ ముకుందుని
ఉల్లంబున నిల్పినేను యుజ్వల రీతిన్
చల్లటి ప్రేమను పొందెద
ఎల్లరు మెచ్చంగ నన్ను ఇది 'వాని' దయే.



ఈ క్రమంలో ఒకదాని తర్వాత ఇంకొకటిగా ఆ స్వామిపై ఎంత వ్రాసినా తనివి తీరటం లేదు. ఇప్పుడు మీ చేతుల్లో వున్న ఈ ముకుందమాల ఈ రూపంలో రావడానికి నేను నిమిత్తమాత్రుణ్ణి. చేయించువాడు ఆ ముకుందుడే. ఎలాగంటే.

ఒక మంచి మిత్రుడు స్వామి సుందర చైతన్యానందుల వారిచే ప్రభావితుడై, ఆ స్వామి వ్రాసిన కులశేఖర్ ఆళ్వార్ వారి ముకుందమాలను ప్రతిపదార్థ తాత్పర్య వ్యాఖ్యా సహితమైన చిన్న పుస్తకమును తెచ్చి చదివి వినిపించారు. నాలోని ఆత్మ స్వరూపుడు వెన్ను తట్టి "నీవు వ్రాయగలవు దీనిని పద్య కృతిగా వ్రాసి పుణ్యం సంపాదించు" అని ప్రోద్బలించాడు. ఇంకొక మిత్రులు అవసరమైన చోట్ల సలహాలిచ్చారు. ఇంకొక మిత్రుడు తప్పులు దిద్దారు. ఇంకొక మిత్రులు కంప్యూటర్‌తో ప్రింట్ చేశారు.



ఇవన్నీ ఒక ఎత్తు అయితే చైతన్యానందుల వారి స్ఫూర్తి ఇంకొక ఎత్తు.

అందుకే ఈకృతిని సుందర చైతన్యానందుల వారికి అంకితం ఇస్తున్నాను.

ఈ రచన గురించి నామాటలు నాలుగు చెప్పడం సముచితం అనిపించి చెబుతున్నాను. ఇది స్వోత్కర్ష అని భావించక అవధరించండి.

ముకుందమాల శ్రీమాన్ కులశేఖర ఆళ్వార్ వారిచే రచించబడిన సంస్కృత కావ్యం. ఆయన తిరువాన్కూరు సంస్థానమును పరిపాలించు రాజుగారు.

తమిళుడు అయిన ఆయన తన మాతృభాషలోనే గాక గీర్వాణ భాషలో కూడ మంచి పండితుడు. భక్తిరసం జాలువారే వీరి రచనల్లో వేదాంతం పుష్కలంగా కనిపిస్తుంటుంది. వీరు భగవంతుని

(పెరుమాళ్‌ను) కీర్తిస్తూ వ్రాసిన పెక్కు గ్రంధాల్లో పెరుమాళ్ తిరుమొలి అనునది సర్వశ్రేష్ఠమైనదని విజ్ఞుల అభిప్రాయం. ప్రస్తుతం మనం చదువుతున్న ఈ రచన పేరు, ముకుందమాల.

అణువణువునా భక్తి వైరాగ్యాలు ప్రస్ఫుటించే, ఈ ముకుందమాల సంస్కృతంలో రచింపబడి కులశేఖరుని ప్రతిభను ద్యోతక పరుస్తుంటుంది. వైరాగ్య తన్మయత్వంలో కులశేఖరులు ప్రపంచాన్నే మరిచిపోయి నాగరికులకి పిచ్చివాడనేపించేవారట.

వాళ్ళనుద్దేశించి కులశేఖరులు ఈ విధంగా అన్నారుట. "ప్రాపంచిక విషయాల వెంట పరుగులిడు వారు నా దృష్టిలో పిచ్చివారు. నేను వారి దృష్టిలో పిచ్చివాడను"

ఇకపోతే నారచన గురించి. నాకు పద్యరచనపై ఉన్న మక్కువతో ముకుందమాలను తెలుగు పద్యములలో



అనువదించాను. ప్రతిపద్యానికి తాత్పర్యం జతకూర్చి శ్లోకాలకి పద్యంలో పొదగని(లేని) అనువాదం ప్రతిబింప చేసి పర్వాలేదని తృప్తి చెందాను.

ప్రతి శ్లోకానికి ముందు ఒక 'అవతారిక' ద్వారా ఆ శ్లోకం ప్రాశస్త్యం చెప్పటానికి ప్రయత్నించాను.

ఆఖరికి నా విన్నపం ఒక్కటి మనవి చేస్తాను. మన వద్దనున్నది ఏదైనా మనకి భగవంతుడు ప్రసాదించిందే. మన సంపదలు, బాధలు, సంతోషం, దుఃఖం, కీర్తి అన్నీ ఆయనిచ్చేవే. ఏ విధంగా ఇస్తాడు మనం చేసుకున్న పాప పుణ్యాల ఫలితంగా ఇస్తాడు. మరి మన కర్తవ్యం ఏమిటి?

శరణాగతి. అనన్య భక్తి. నీవే తప్ప ఇతః పరం బెరుగ అనడం.

మరి ఆలశ్యమెందుకు కులశేఖరుని ముకుందమాలను ధరించండి......



# ప్రార్థన

కం॥ శ్రీకరుని ఆ ముకుందుని
నేకొలిచెద మనము నిల్పి నీమము తోడన్
చేకొని 'ముకుందమాల' ను
మీకందించెదను భక్తి మీరిన ధృతితో

చం॥ అరయుదురీ ప్రపంచ విషయంబుల నాశతొ మానవాళియున్
పెరిగిన బాధలొందెదరు, వీరికి నేనొక 'పిచ్చివాడ', పో
తరిగెడిదేమి నాకు మదిదాల్చెద నేనను వారినంతియే,
స్థిరముగ దెల్పినాడు 'కులశేఖరు'డివ్విధి ధీర చిత్తుడై



కం॥ చలియించని భక్తుండై
'కులశేఖరు'డంత ఆ 'ముకుందుని' గొలిచెన్
తెలిపిన 'సుందర స్వామి' ని
కొలుచుచు అందింతు నీ 'ముకుందునిమాలన్'

ఆ॥ తెలుగు పద్యమందు తెలిపెద సత్కృపన్
స్వామి కరుణవల్ల శ్రావ్యమైన
రీతి చదువ గలరు అతులిత భక్తితో
ఆ 'ముకుంద' గొలువరయ్య నేడె.

తే॥ నేల పడినట్టి చినుకులు నిలువ బోవు,
నేడు మరలిన రాదయ్య వేడుకొనిన
రేపు వచ్చునో రాదొ ఈరేయి గడచి
ఏది శాశ్వతంబగునయ్య ఈ జగతిని.

సీ॥ కండ బిగువు తగ్గు, కంటి చూపానదు,
దంతంబు లూడును దవడ జారు
జుట్టు ముగ్గయిపోవు, పట్టుదప్పును చేయి
రోగాల రొంపితో రోత బుట్టు,
మాట స్పష్టతబోయి మాట్లాడ లేకుండు
తిండి సహించదు దిగులు పోదు,
రేయింబవళ్ళకు లేకుండు భేదమ్ము
ఎప్పుడా చావని ఏడ్చుచుండు

ఆ॥ జరుగబోవునిదియె, సత్యంబు దెలియక
'నావి' 'నావి' అనును నరుడు అన్ని
ఏమి మాయ నీది ఎరుగంగ సాధ్యమే?
ఈవెగతివి పతివి హే ముకుంద!



ఆ॥ ధైర్యమును, వితరణ, దైవభక్తియులేక
వివిధ రకములైన వింతగొలుపు
పాప చింతలుగల బడుగులందరికిని,
నాకు కృష్ణుడొకడె నయము, గతియు.

మ॥ ఇతడే దిక్కని హే ముకుంద! శరణున్
ఏ నొందితిన్ ధన్యునై
ఇతడే కావలెనంచు వేడితిని రా,
హేభక్తమందార! నా
కితడే చాలను బుద్ధినిమ్మనికనే
నే భాగ్యముల్ భోగముల్
జతగా కోరను నిన్నుగొల్చెదను నాశ్వాసున్న
సేపైననున్



# ముకుందమాల

## అవతారిక 1 :

"శ్రీరంగ పట్టణమునకు పోవువారుంటే రండి" అని ప్రజల సౌకర్యం కోసం చాటింపు వేయించే కులశేఖర భూపతికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను – అని చెప్పబడినందున ఈ అవతారికా ప్రథమ శ్లోకం ఎవరో ముకుందమాలా శోభితుడైన శ్రీహరి శరణాగత భక్తుడు, కులశేఖరుని కీర్తించుచూ చెప్పిన దానిగా భావించవచ్చును.

శ్లో॥ ఘుష్యతే యస్య నగరే
రంగయాత్రా దినే దినే
తమహం శిరసా వందే
రాజానం కులశేఖరమ్ 1



తే॥ ఎవని నగరంబులో ప్రజ కెరుక గలుగ
వార్త శ్రీరంగయాత్రకై బయలు వెడలు
అట్టి కులశేఖరుండను అధిపు దలచి
వంచి శిరము నేను నమస్కరించుచుంటి

తా॥ ఎవ్వని నగరంలో ప్రజలకు తెలియుట కొరకు శ్రీరంగ యాత్రగురించి చాటింపు వేయబడునో అట్టి కులశేఖర మహారాజుకు శిరస్సు వంచి నమస్కరించుచున్నాను.

## అవతారిక 2 :

ఇది ముకుందుని పలు నామాలతో, శరణాగతుడై శ్రీహరి కరుణార్ద్రియైన కులశేఖర భూపతి భక్త ప్రియుడైన ఆ ముకుందుని మాలలో మొదటి రత్నాన్ని అమరింప చేస్తున్నారు. అవధరించండి. ఇది మంగళాశాసనము.

శ్లో॥ శ్రీవల్లభేతి వరదేతి దయాపరేతి
భక్తప్రియేతి భవలుణ్ఠన కోవిదేతి
నాథేతి నాగశయనేతి జగన్నివాసే
త్యాలాపనయం ప్రతిపదం కురు మే ముకున్ద! 2

తే॥ హే ముకుంద! శ్రీవల్లభా! హే దయాళో!
వరద! సంసార విధ్వంస! భక్తపాల!
నాధ! జగపతీ! దయజూపు నాగశయన!
అనుచు పల్కు భాగ్యమునిమ్ము అమిత కరుణ.

తా॥ ఓ ముకుందా! శ్రీ వల్లభా! వరదా! దయాపరా! భక్తప్రియా! సంసార విధ్వంసకా! నాధా! నాగశయనా! జగన్నివాస! అడుగడుగునా నాకు నీ పలుకుల అనుగ్రహమిచ్చి కాపాడుము.



## అవతారిక 3 :

మంగళా శాసనములతో ముకుందుని కొలిచాక విజయ ఘోష చేస్తున్నారు. ఇంతకన్నా మంచి తరుణమేముంటుంది. జయజయధ్వానాలతో జగతి మార్మోగిపోతోంది.

శ్లో॥ జయతు జయతు దేవో దేవకీ నన్దనోయం
జయతు జయతు కృష్ణో వృష్ణివంశ ప్రదీపః
జయతు జయతు మేఘశ్యామలః కోమలాంగో
జయతు జయతు పృథ్వీభారనాశో ముకుందః

తే॥ జయము దేవకీ నందనా! జయము దేవ!
వృష్ణివంశ మంగళదీప! కృష్ణ! జయము
జయము కోమలాంగా! మేఘశ్యామ! జయము
భూమి భారవిమోచనా! హే ముకుంద!



తా॥ ఓ దేవకీ నందనా నీకు జయమగుగాక! దేవా! వృష్ణి వంశమంగళ దీపా! నీకు జయమగుగాక. కోమలమైన అంగములుగల ఓ నీలమేఘ శ్యామసుందరా! నీకు జయమగుగాక! భూభార నిర్మూలనకు అవతరించిన ఓ ముకుందా! నీకు జయమగుగాక!

## అవతారిక 4 :

ఎంత విచిత్రం! ఆదిలోనే మెలిక పెడుతున్నారు. వరం కోరుకుంటున్నారు. ఆ వరం ప్రతి జన్మకీ కావాలట. నారదాది మునులకు కలిగే భాగ్యం తనకీ కావాలేమో! నాకు ఒక్క వరం చాలు నేను కోరుకున్నప్పుడల్లా కనపడి అప్పుడు నేను కోరుకునే కోర్కె దీర్చమన్నాడట ఒక గడుసు భక్తుడు. భక్తులు పాపాయిలవలె మొండివాళ్ళు.



శ్లో॥ ముకుంద మూర్ధ్నా ప్రణిపత్య యాచే
భవన్త మేకాన్త మియన్త మర్థం
అవిస్మృతి స్త్వచ్చరణారవిన్దే
భవే భవే మేస్తు భవత్ప్రసాదాత్ 4

చం॥ శిరమును వంచి వేడెదను చేతును వందన
మోముకుంద! నే
వరమొక దాని వేడెదను, వద్దన బోకుము
ఇమ్ము ఓ ప్రభూ!
స్థిరముగ జన్మ జన్మలకు చిత్తము నీయెడ
నుండ జేయుమా
బరువిది కాదు, దివ్యమగు పాదము చెంతనె
నన్ను నిల్పుమా!

తా॥ ఓ ముకుందా! తలవంచి నీకు నమస్కరించి నిన్ను ఒకవరం వేడుకుంటాను. హే ప్రభూ! వద్దనకుండా నాకు అనుగ్రహించు. జన్మ జన్మలకు నీమీదనే స్థిరమైన మనస్సు ఉండునట్లు జేయుము. అది నీకు పెద్ద బరువైన పని కాదు. నీ దివ్యమైన పాదముల వద్ద నాకు కొంచెము చోటు ఈయలేవా?

## అవతారిక 5 :

మానవులంతా బ్రతికి ఉన్నప్పుడు సుఖ శాంతులు, చనిపోయాక నరక బాధలు లేని స్వర్గంలో 'సుఖాలు, భోగాలు' కోరుకుని అక్కడే వుండిపోవాలని కోరుకుంటారు. అది సహజమే. కాని కులశేఖరుడు ఏం కోరుకుంటున్నాడో చూడండి. 'కొబ్బరికాయ' కొట్టి కోరికలు వినిపించే 'భక్తుల'కు కులశేఖరుని కోరిక వింతగానే వుంటుంది.



శ్లో॥

నాహం వందే తవ చరణయో ర్ద్వంద్వమద్వంద్వహేతోః
కుమ్భీపాకం గురుమపి హరే! నారకం నాపనేతుం
రమ్యా రామా మృదు తనులతా నన్దనే నాపి రంతుం
భావే భావే హృదయ భవనే భావయేయం భవన్తం

సీ॥ పరమాత్మ! సుఖదుఃఖ ద్వంద్వాల సడలింపు
నను దయజూడుము నాకు పతివి
కుంభినీపాకమన్ ఘోర నరకమందు
భయవహ దుఃఖాగ్ని పారద్రోలు
స్వర్గంబు నందలి జవరాంద్ర సుకుమార
దేహాల కాంక్షించ, దివ్యమైన
సుఖ భోగములపైన చూపేల? నాకింక
వాటికై కాదయ్య వందనములు.



తే॥ అన్ని భావంబులన్ యెద నిన్ను నిలిపి
నేను ధ్యానింతు సతతంబు నిన్ను తలచి
గతిగ, సర్వేశ! హే ప్రభూ! కావుమయ్య
ఇంక రానిమ్ము నీకృప హే ముకుంద!

తా॥ ఓ పరమాత్మా! సుఖదుఃఖములనే ద్వంద్వములను తొలగించమని కోరను. నాకు భర్తవు నీవే. నన్ను దయజూడుము. కుంభినీ పాకమను ఘోర నరకంలో మ్రగ్గుట అనే ఘోర దుఃఖాగ్ని నార్పుమని కోరను. స్వర్గంలోని దేవాంగనల దివ్యమైన పొందుగాని సుఖ భోగములు కానీ నాకక్కరలేదు. నేను నీకు నమస్కరించునది వాటికోసం కాదు. అన్ని విధములుగా నిన్ను నామది నిలిపి ఎల్లవేళలా నీవే నాగతి అని నిన్ను ధ్యానింతును ఓ సర్వేశ్వరా! ముకుందా! నీకృప రానిమ్ము.



## అవతారిక 6 :

భగవంతుడు కనులకు కనబడితే ఉన్నతులు కూడా చతుర్విధ పురుషార్థములు సాధించిన తమ జీవితం ధన్యం కావలెనని కోరుకుంటారు. తనకి అవేవీ వద్దంటున్నారు. జన్మ బంధాలు తప్పవు కాబట్టి కమలాక్షునర్చించే జ్ఞానం బుద్ధి ఇస్తే చాలని కోరుకుంటున్నారు. అనుభవం లేకుండా అత్యున్నతమైన పదవినిచ్చినా లాభం లేదని ఆ పదవి నిలబెట్టుకోవడం కష్టం అని కులశేఖరునికి తెలుసు.

శ్లో॥

నాస్థా ధర్మే న వసునిచయే నైవ కామోపభోగే
యద్య ద్భవ్యం భవతు భగవన్! పూర్వ కర్మానురూపం
ఏత త్ప్రార్థ్యం మమ బహుమతం జన్మ జన్మాంతరేపి
త్వత్పాదాం భోరుహ యుగగతా నిశ్చలా భక్తి రస్తు

సీ॥ ధర్మంబుపై నేను తవిలి యుండెడి కోర్కె
లేదయ్య భగవంత! లేదు నాకు
కామానుభవముపై కలుగు కోరిక కూడ
లేదయ్య పరమాత్మ! లేదు నాకు
విత్తమ్ము నార్జింప విడలేని కోరిక
లేదయ్య సర్వేశ! లేదు నాకు
గతజన్మలందరి కర్మాను సారమే
జరుగునన్నియు అట్లె జరుగు గాక!

తే॥ ఏది యెట్లైనా మునుముందె ఎరుకగాదు
జన్మ జన్మంబులకు నీదు చరణ కమల
సేవపై దృఢతర భక్తి చేతనాకు
తలపు నిరతంబు నీపైన కలుగు గాక!

తా॥ ఓ భగవంతా! నేను ధర్మంబుపై నిలిచి యుండవలెనన్ే కోర్కె కూడా నాకు లేదు. ఓ పరమాత్మా! కామానుభవంపై కలిగే కోర్కె కూడ



నాకు లేదు. ఓ సర్వేశ్వరా! ధనార్జనపై సాధారణంగా మానవులకుండే విడువలేని కోర్కె నాకు కలుగుటలేదు. గత జన్మల కర్మానుసారంగానే (ఈ జన్మలో) అన్నీ జరుగుతాయి. అట్లే జరుగుగాక. మున్ముందుగా ఏం జరుగుతుందో ఎవ్వరికీ తెలియదు. జన్మ జన్మలకు నీ చరణ కమలములను సేవించుట యందు దృఢతరమైన భక్తి కలిగి యుండుటచే ఎల్లప్పుడూ నీపై తలపు కలుగు గాక.

## అవతారిక 7 :

మానవుల కర్మానుసారంగా నరకమో స్వర్గమో లేదా మరల మానవ జన్మతో భూలోక వాసమో ప్రాప్తించవచ్చును. ఏది లభించినా తనకే అభ్యంతరమూ లేదంటున్నారు కులశేఖరులు. తనకి జీవించి వున్నప్పుడేగాక చనిపోయేటప్పుడు కూడా నారాయణునిపై ధ్యాస ఉంటే చాలట.



శ్లో॥ దివి వా భువి వా మమాస్తు వాసః
నరకే వా నరకాంతక! ప్రకామం
అవధీరిత శారదారవిందౌ
చరణౌ తే మరణేపి చింతయామి 7

చం॥ గొనకొని ఆ దివిన్ భువిని ఘోరములౌ
నరకంబులందునన్
మనుటకు నాకు సమ్మతమె మాధవ!
ఓ నరకాంతకా! శర
ద్వనజమువంటి నీదు శుభ పాదముపైననె
నాదు ధ్యాస, నే
'చనునెడ' నైన నిల్పెదను చక్కగ నాయెద
వాటిపై ప్రభూ



తా॥ ఓ మాధవా! నరకాసురాంతకా! ప్రయత్నముచే నేను స్వర్గమందైనా, భూలోకంలో నైనా, ఆఖరికి ఘోరమైన నరకంలో ఉండుటకైనా నాకు అంగీకారమే. శరత్కాలమందు పద్మముల వలె శోభ కల నీ పాదములపైనే నా ధ్యాస నేను మరణించు సమయముననైనా నీపై నా ధ్యాస ఉంచు భాగ్యము నాకు చాలును.

## అవతారిక 8 :

సరే మానవులు భగవద్ధ్యానం ఎల్లవేళలా ఎందుకు చేయాలి? శాస్త్రాలు చెప్పినట్లు (ఇప్పుడు చక్కగా సుఖించి) అంతిమ క్షణంలో శ్రీహరీ అని అంటే వైకుంఠ ప్రాప్తి కలుగుతుందట కదా, అలా చేస్తేనేం? ఇప్పటినుంచే వైరాగ్యం 'దండుగ' కదా! కులశేఖరులు అట్లాంటి 'తెలివిగల' వారికేం చెప్తున్నారో చూడండి.

శ్లో|| కృష్ణ! త్వదీయ పద పంకజ పంజరాన్త
మద్యైవ మే విశతు మానస రాజహంసః
ప్రాణ ప్రయాణ సమయే కఫవాత పిత్తైః
కంఠావరోధన విధౌ స్మరణం కుతస్తే 8

ఉ|| నాదగు మానసంబనెడి నాణ్యత గల్గిన
రాజహంస, నీ
పాద సరోరుహంబు యెడ భక్తివసించును,
కృష్ణ! ప్రాణముల్
వేదన నొంది వీడునెడ పిత్తకఫలంబులు
గొంతుకడ్డమై
రాదిక మాట, నాడు నిను రమ్మనలేనుర
నేడె పిల్చెదన్



తా|| ఓ శ్రీకృష్ణా! శ్రేష్ఠమైన రాజహంస వంటి నా మనస్సు నీ పాద పద్మములయందు భక్తితో నెలకొని యుంటుంది. నా ప్రాణములు పోవు సమయమున బాధతోనూ పిత్తము కఫమూ గొంతు కడ్డమై మాట రాకపోవుటచే ఆరోజు నిన్ను రమ్మని పిలువలేను కదా! అందుచేత నేడే నన్ను రక్షించమని పిలిచెదను.

## **అవతారిక 9 :**

శ్రీకృష్ణ పరమాత్మపై ధ్యాస కలగాలంటే ఆయన దయకలగాలి. అందుకు ఆయన ప్రార్థన ఎలా ప్రారంభించాలో చూడండి. ఆయన్ని ఒక్కసారి తలుచుకుంటే చాలదు. మాటి మాటికీ తలుచుకోవాలి. ఎలాగంటే.....



శ్లో|| చింతయామి హరిమేవ సంతతం
మంద మంద హసితాన నాంబుజం
నంద గోప తనయం పరాత్పరం
నారదాది మునిబృంద వందితం 9

ఉ|| నందుని ముద్దు బిడ్డడును, నారదుడాది
మునీంద్ర శ్రేణిచే
వందితుడౌ పరాత్పరుడు, పంకజనాభుడు,
ఆది దేవుడున్,
అందము చిందు లేనగవు లార్తిని బెంచగ
పారవశ్యతన్
చెందుచు ధ్యానమున్ సలిపి శ్రీహరి వేడెద
సారెసారెకున్

తా|| నందుని గారాల బిడ్డడును, నారదాది ముని స్తుత్యుడును, పరాత్పరుడును, పద్మనాభుడును



ఆది దేవుడును అయిన ఈ శ్రీహరిని అందాలొలుకు చిరునవ్వులు ఆర్తిని బెంచి పరవశముతో ధ్యానించుచూ మాటిమాటికీ వేడుకుందును.

## **అవతారిక 10 :**

హరి కీర్తనమైన పిదప అన్ని శ్రమల కోర్చి హరి సరోవరం చేరుకున్న కులశేఖరులు తనకు హరి సహాయం ఎందుకు కావాలో ఆర్తితో సెలవిస్తున్నారు. ఆ విజ్ఞాపన చూడండి.

శ్లో|| కరచరణ సరోజే కాంతిమ న్నేత్రమీనే
శ్రమముషి భుజవీచి వ్యాకులేగాధమార్గే
హరి సరసి విగా హ్యాపీయ తేజోజలౌఘం
భవమరు పరిఖిన్నః ఖేద మద్య త్యజామి 10

సీ॥ సంసారమను మహా సైకతపుటెడారి
అడుగిడి పయనించి అలిసినాడ
హరియను సరసున చేరుకొంటిని నేను
సేదదీరగ నెంచి శీఘ్రగతిని
హరికరచరణాలు అను పద్మముల శోభ
ఆసరోవరమందు అలరుచుండె
కాంతివంతములైన కన్నులు మీనాలు
భుజములు కెరటాల పోలియుండె

తే॥ ఘన అగాధపు మార్గాల కలుగు శ్రమను
అన్ని అస్వస్థతల ద్రుంచు హరి సరసున
నున్న తేజోజలంబున నోలలాడి
త్రావి వెతవీడి శుభముల దాల్తుగాక

తా॥ ఈ ప్రపంచం అనే గొప్ప ఇసుక ఎడారిలో పయనించి అలసిపోయాను. నేను హరి అనే సరోవరమును చేరుకొని చివరికి సేదదీరుటకై



త్వరగా చేరుకున్నాను. ఆ సరోవరంలో హరిహస్తములు పాదములు అను పద్మములచే అలరారుచున్నది. ఆ స్వామి కాంతివంతమైన కన్నులు చేపలవలె శోభిల్లుతున్నవి. భుజములు కెరటాలను పోలియున్నవి. గొప్ప అగాధములైన మార్గములయందు శ్రమను దూరము చేయగలిగినది ఆ శ్రీహరి నామమొక్కటే. అన్ని అస్వస్థతలను పట్టి అణచునట్టిది ఆ శ్రీకృష్ణ నామ స్మరణమొక్కటే. ఇంకా నీకు విచారమెందుకు?

## అవతారిక 11 :

మానవుడు హరినామస్మరణ చేస్తానంటే అందుకు పెద్ద అడ్డంకి వాడి మనస్సే. దానంతట దానికి తోచదు, చెప్తే వినదు. హరినామస్మరణే ఆ కోతిని దారిలో పెట్టగలదు. ముమ్ముందు హరికీర్తన చేస్తూ నయాన దానికి నచ్చచెప్తున్నారు కులశేఖరులు.



శ్లో॥ సరసిజ నయనే సశంఖచక్రే
మురభిది మావిరమస్వ చిత్త రన్తుమ్
సుఖతర మపరం నజాతుజానే
హరి చరణ స్మరణామృతేన తుల్యం 11

ఉ॥ శ్రీధరు పాద సంస్మరణ, చిత్తమ!
మేలగు, ఆసుధారసా
న్మాధురి మోదమీయు, నువు మానక
జేసిన పట్టుతోటి, ల
క్ష్మీధవు, శంఖచక్రధరు, మేలు భజింపుము
శ్రీహరిన్ సదా
మాధవు, పద్మలోచనుని మంగళదాయకు
నామురారినిన్.

తా॥ ఓ చిత్తమా! ఆ శ్రీహరి పాదములను స్మరించుటే మేలగును. ఆ స్మరణ అమృతమువలె



మాధుర్యముచే సంతోషము నొసంగును. నువ్వు (చిత్తము) విడువక పట్టుదలతో ఆ లక్ష్మీపతిని, శంఖ చక్రధరుని, మాధవుని, పద్మనయనుని, మంగళదాయకుని, మురారిని, మేలుగా భజింపుము. ఆ స్మరణామృతానికి సాటియైనది, సుఖదాయి అయినదానిని నేనెరుగను.

## అవతారిక 12 :

మందమతియైన మనస్సును మందలిస్తున్నారు కులశేఖరులు. జాగు చేయక శ్రీమన్నారాయణుని నామ స్మరణను చేయమని నచ్చ చెబుతున్నారు. యముడి భయం గురించి చెప్పినా వినని మనస్సుని బ్రతిమాలుతున్నారు. మాటవినని కొడుకు కోసం బాధ పడే నాన్నని తలపించటమే కాక మనస్సుని నిజంగా నచ్చ చెప్పేట్లుంది.

శ్లో॥ మాభీ ర్మందమనో విచింత్య బహుధా
యామీశ్చిరం యాతనాః
నామీనః ప్రభవన్తి పాపరిపవ స్వామీ
నను శ్రీధరః
ఆలస్యం వ్యపనీయ భక్తి సులభం
ధ్యాయస్వ నారాయణం
లోకస్య వ్యసనాప నోదనకరో దాసస్య
కిం నక్షమః

సీ॥ మందమతీ! యముడొందించు వేదన
తలపోయుచున్ మది కలత వలదు
మననాథుడును తనే మాధవుడవుటచే
పాపాలగల్గెడి బాధలేదు
నారాయణుని సదా నామస్మరణజేయ
మనస్వామి కాపాడు మనల నెల్ల
జాగు చేయగనేల సత్వరంబా హరిన్
ధ్యానింపు మిప్పుడే తనివి దీర



తే॥ అన్ని లోకాలలోగల అన్ని వెతలు
తొలగ జేయగలుగువాడు తోయజాక్షు
డతని దాసుల బాధల నాపలేడె?
వ్యసనముల దీర్చి కావడే! అవనిధరుడు

తా॥ ఓ తెలివి తక్కువదానా! (మనస్సా) యమధర్మరాజు నీకీయబోయే బాధల్ని తలచుకొని ఎందుకు అంత దుఃఖిస్తావు? మనస్వామి మాధవుడు కావున మనకు పాపాల వల్ల కలిగే బాధ ఉండదు. ఆ శ్రీమన్నారాయణుని సదా ధ్యానిస్తుంటే ఆయనే మనల్ని కాపాడతాడు మరి ఇంక ఆలస్యమెందుకు? ఆయనిని తక్షణం ధ్యానించు. ఏయే లోకాల్లో ఏయే బాధలుంటాయో ఆయా బాధల్ని తొలగజేయు వాడు తోయజాక్షుడైన ఆ ముకుందుడొక్కడే. ఆయనని ధ్యానిస్తే భూకాంతుడైన స్వామి మన దిగులును తొలగించడా? తప్పక తొలగిస్తాడు.



## అవతారిక 13 :

మాట వినక సంసార సాగరంలో పడిపోయింది మనస్సు. ఇక బయటకు రావాలి ఎలా? స్వయంకృతాపరాధమైనా ఏదో చేయాలి గదా. ఒక పక్క నానాటికి ఉధృతమౌతున్న వరదలో మునిగిపోయే నౌకలా వుంది దాని పరిస్థితి.

శ్లో॥ భవ జలధి గతానాం ద్వన్ద్వ వాతాహతానాం
సుత దుహితృ కళత్ర త్రాణ భారార్దితానామ్
విషమ విషయ తోయే మజ్జతా మప్లవానాం
భవతు శరణ మేకో విష్ణుపోతో నరాణామ్

సీ॥ భవసాగరంబున బడిన వారై నరుల్
సుఖదుఃఖములు పొందుచుందురవని
ద్వంద్వంబులనబడు బలమైన వాయువు
చెదరగొట్టుట జేత చింత కలుగు



పుత్రులు, అర్ధాంగి, పుత్రిక లొసగెడి
భారమ్ముచే క్రుంగి బాధ కలుగు
ఇంద్రియ విషయాలు ఇచ్ఛలు అనబడు
నీట మున్గుచు తాము నీల్గుచుంద్రు

తే॥ విషము నిండిన ఆ నీట భీతి చెంది
మునిగిపోవుచు నౌకకై పూని వెదకి
శ్రీమహావిష్ణువను నౌక అమరె నాకు
శరణమదియొక్కటే గదా జగతి బ్రోచు

తా॥ మానవులు సంసార సాగరంలో పడి సుఖదుఃఖాలను పొందుతూ ఈ పృథ్విలో ద్వంద్వములను బలమైన సుడిగాలిలో చిక్కుకుని నిలకడలేక చెదరగొట్టబడి దుఃఖిస్తున్నారు. భార్య, సంతానం అనే వారివల్ల భారం మోయలేక క్రుశించి పోతూ బాధలు పడుతున్నారు. ఇంద్రియ విషయములు కోర్కెలు అనబడు నీటిలో మునుగుతూ

వేదననొందుతున్నారు. ఈ విషమయమైన నీటిలో మునిగిపోతూ ఒడ్డు చేరుటకు నౌకను వెతుకుతున్నారు. ఆ శ్రీమన్నారాయణుడే ఒక క్షేమదాయకమైన నౌక. ఆ స్వామిని శరణు వేడుటే గదా. ఈ జగత్తును కాపాడగలుగును.

## అవతారిక 14 :

ఓ చిత్తమా! బెంగపెట్టుకోకు. సంసార జలధి దాటించ గలది రెండక్షరముల నామమే అని చెప్పి ఆ 'హరిని' భక్తితో వేడుకోమని ఉపదేశిస్తున్నారు, కులశేఖరులు బుజ్జగిస్తున్నారు.

శ్లో॥ భవ జలధి మగాధం దుస్తరం నిస్తరేయం
కథ మహ మితి చేతో మాస్మగాః కాతరత్వమ్
సరసిజదృశి దేవే తావకీ భక్తి రేకా
నరకభిది నిషణ్ణా తారయిష్య త్యవశ్యమ్



చం॥ కలతను జెందనేలనె? అగాధము దాటనశక్య
మైనదిన్
వెలువడలేనిదైన భవసాగరమీదగలేక
భీరువై
నిలువకు, దేవదేవు, అవనీ సుతుభంజను,
సారసాక్షునిన్
కొలువుము భక్తితత్పరత, కోరి తరింతువు
నాదు చిత్తమా!

తే॥ ఓ నా చిత్తమా! ఈ భవ సాగరము చాలా లోతైనది. దాటుటకు సాధ్యము కానిది అని విచారించకుము. బయటకు రాలేనని భయపడి పిరికివి కాబోకుము. ఆ దేవదేవుని, భూకాంతసుతుడైన నరకుని వధించిన వానిని, పద్మనయనుని భక్తితో మనఃపూర్వకముగా కొలిచి తరించుము.



## అవతారిక 15 :

గొప్ప వేదాంత భరితమైన ఈ శ్లోకంలో కులశేఖరులు మానవుని, కోరిక (వాంఛ) కామము, మోహం వంటివి ఎలా బానిసను చేస్తాయో వివరించారు. భార్యా సంతానములను సుడిగాలి మొసళ్ళతో పోల్చడం వారి సంసార విముఖతను సూచిస్తోంది. శ్రీహరిని త్రివిక్రమునిగా కీర్తించి ఈ సంసార సాగరాన్ని దాటుటకు నావవై సహాయపడమని అర్థిస్తున్నారు.

శ్లో॥ తృష్ణాతోయే మదన పవనోద్ధూత మోహోర్మిమాలే
దారావర్తే తనయ సహజ గ్రాహ సంఘాకులేచ
సంసారాఖ్యే మహతి జలధౌ మజ్జతాం న స్త్రిధామన్
పాదాంభోజే వరద భవతో భక్తినావం ప్రయచ్ఛ



సీ॥ 'తృష్ణ' నాబడు, దారితెన్ను లేని సలిల
భరితమై కామమన్ పవన ధృతిని,
మోహము అనబడు లాహిరి ముంచును
మునక తప్పదు గాన ముప్పు దెచ్చు
సతియను సుడిగాలి, సుతులు సహోదరుల్
మకరంబులై బట్టి మట్టుబెట్ట
సంసారమను మహా సాగరమియ్యది
దరిలేదు ఎన్నడున్ తరుగబోదు

తే॥ క్రుంగుచుంటిమి పొందగ భంగపాటు
నీదు చరణాలపై భక్తి ఆదుకొనెడి
నావ, దాని నొసంగుము బ్రోవుమమ్ము
ఓ త్రివిక్రమా! ఓ ప్రభూ! ఓ వరదుడ!

తా॥ ఓ త్రివిక్రమా! వరదా! 'తృష్ణ' అనబడు దారితెన్నూ లేని నీటితో నిండినదియు, కామము అను ఝంఝామారుతము కలదియు, మోహమను ముంచు స్వభావముగల అలలలో మునిగి పోవుట తప్పదు కావున ముప్పు తెచ్చునట్టిదే. భార్య అనే గొప్ప సుడిగాలి, పుత్రులు సోదరులనే భయంకరమైన మొసళ్ళు మాకు మృత్యువు నిచ్చునవే. ఈ సంసారమహా సాగరం అంతులేనిది, ఎన్నటికీ తరిగిపోనిది. ఓ ప్రభూ! అవమానాలు భరిస్తూ ఇందులోనే దుఃఖిస్తున్నాము. ఇక నీ చరణములపై భక్తి ఒక్కటే మమ్ము కడతేర్చ గల నావ. దానిని మాకు దయచేసి మమ్ము కాపాడుము.

## అవతారిక 16 :

గత జన్మపుణ్యం వలన మానవులు మంచి జన్మ లభించినా అనవసరమైన వ్యామోహాలతో దానిని



సాఫల్యం చేసుకోక ఆ శ్రీహరి భక్తి మరచి ఆయన విముఖులతో స్నేహం చేసి చెడిపోతారు. శ్రీహరి ధ్యాస కుదరటం కంటే అది నిలువటం ఇంకా కష్టం. మనం అందుకు చేయాల్సిన మొదటి పని ఆయనను కాదనే వారితో చెలిమి మానుకోవటం. ఆయన భక్తులతో స్నేహం చేయటం. కులశేఖరులు చెప్పిన ఈ చిన్న చిట్కా ఎంత గొప్పదో చూడండి.

శ్లో॥ మాద్రాక్షం క్షీణ క్షణమపి భవతో
భక్తిహీనాన్ పదాబ్జే
మాశ్రౌషం శ్రావ్యబంధం తవ చరిత
మపాస్యాన్య దాఖ్యాన జాతం
మాస్మార్షం మాధవ త్వామపి భువనపతే
చేతసాపహ్నువానాన్
మాభూవం త్వత్సపర్యా వ్యతికరరహితో
జన్మ జన్మాంతరేపి



సీ॥ జన్మాంతరంబుల క్షయమైన పుణ్యంబు
చే, నీదు భక్తికి చేరువవక
నీ పద పద్మాలనే కనుగానక
ఉండు వారలు చూడకుందుగాక
నీ స్తుతి పఠియించనేరని ఏకృతి
చెవిసోకకుండగా జేయుమయ్య!
మనసునైనన్ కాదు అని నిన్ను అనువారి
దరిజేరు దుర్గతి తప్పుగాక

తే॥ నీదు సేవయే ఎన్నడున్ నేను కోరు
కొందు, దానిని నిలుపుము పొందనిమ్ము
దూరమయ్యెడి దుర్గతి తొలగనిమ్ము
నాకు దగ్గరై నిలువుమా లోకనాథ!

తా॥ ఓ జగన్నాథా! జన్మజన్మలకు చేసిన పుణ్యం క్షీణిస్తుండగా అప్పుడు నీ భక్తికి దూరమయ్యే దుర్గతి పడుతుంది. అప్పుడు నీ పాద పద్మాలను ధ్యానించాలని తోచదు. ప్రభూ! నాకట్టి దుర్గతి



కలుగకుండ కాపాడుము. నిన్ను స్తోత్రించని ఏ కావ్యమూ నా చెవులకు వినపడకుండా అనుగ్రహింపుము. మనస్సులోనైనా నిన్ను వ్యతిరేకించు వారి దగ్గరకు పోయే దుర్గతి నాకు రాకుండుగాక. ఓ లోకనాథా! ఎప్పటికీ నీ సేవాభాగ్యమే నేను కోరుకుంటాను. దానిని నాలో నిలుపుము. నాకు దగ్గరగా ఉండు. దూరం అయ్యే దౌర్భాగ్యం రానీయకు.

## అవతారిక 17 :

అద్భుతమైన ఈ శ్లోకములో కులశేఖరులు తనదేహంలోని ఒక్కొక్క అవయవాన్ని ఉద్దేశించి హితవుగా అవి చేయవలసిన పనులను వివరిస్తున్నారు. మానవుని అవయవాలు ఆయన చెప్పిన పనులు చేస్తే ముకుందుని దయ తప్పక కలుగుతుంది. వివిధ విష్ణు నామాల ప్రయోగం సుమధురం.

శ్లో॥ జిహ్వే కీర్తయ కేశవం మురరిపుం చేతో
భజ శ్రీధరం
పాణి ద్వంద్వ సమర్చ యాచ్యుత కథా
శ్రోత్ర ద్వయ త్వం శ్రుణు
కృష్ణం లోకయ లోచన ద్వయ హరే ర్గచ్ఛాం
ఘ్రియుగ్మాలయం
జిఘ్రఘ్రాణ ముకుంద పాదతులసీం
మూర్ధన్న మాధోక్షజం

సీ॥ కేశవున్ ఓ నాల్క! కీర్తించ వేలనే?
చిత్తమా! విష్ణున్ భజింపవేమె?
కరములారా! హరిన్ కరము నర్చింపుడీ
చెవులార! అచ్యుతున్ చేరి వినుడు
అంఘ్రియుగ్మమ! హరి ఆలయమేగుడీ,
కనులార! కృష్ణుని కాంచరేల?
నాసికా! దేవకీ నందను పదముల
చెలగెడి శుభకర తులసి మాల



తే॥ బూని వాసన చూడరే, పుణ్యమబ్బు
ఓ శిరమ్మా! నువీనాడు ఉత్సుకతను
మాధవునికి తక్షణమే నమస్కరించి
ఆ ముకుందుని మ్రొక్కుము సేమమగును.

తా॥ ఓ నాలుకా! ఆ కేశవుని ఎందుకు కీర్తించవు? ఓ మనసా! ఆ విష్ణుమూర్తిని ఎందుకు భజించవు? ఓ హస్తములారా! ఆ శ్రీధరుని అర్చన చేయండి. ఓ చెవులారా! ఆ అచ్యుతుని చేరుకుని వినండి. ఓ పాదములారా! ఆ శ్రీహరి ఆలయానికే వెళ్ళండి. ఓ కన్నులారా! మీరు శ్రీకృష్ణునే ఎందుకు చూడరు? ఓ నాసికా! ఆ దేవకీ నందనుని పాదముల చెంతనుండు శుభప్రదమైన తులసి మాలలను ఆ



ఘ్రాణించితేనే పుణ్యం కలుగుతుంది. ఓ శిరస్సా! నువ్వీరోజు ఉత్సాహంగా, వెంటనే ఆ మాధవునికి నమస్కరించి ఆ ముకుందుని పూజింపుము నీకు క్షేమం కలుగుతుంది.

## అవతారిక 18 :

ఈ శ్లోకంలో కులశేఖరులు మానవులకు కలిగే తప్పనిసరి వ్యాధులైన చావు పుట్టుకలను, వాటికి గొప్ప 'మందు' ను తెలుపుతున్నారు. పూర్వం జ్ఞానులు తెలిపిన ఆ దివ్య ఔషధం పేరు శ్రీహరి నామస్మరణ. దానిని ఒక్కసారి కాదు ఎప్పుడూ తీసుకుంటూ ఉండమని ఆ ముకుందుని నామౌషధాన్ని తీసుకోమంటూ బోధిస్తున్నారు.



శ్లో॥ హేలోకాః శ్రుణుత ప్రసూతి మరణ వ్యాధే
శ్చికిత్సా మిమాం
యోగజ్ఞాః సముదాహరంతి మునయో యాం
యాజ్ఞవల్క్యాదయః
అంతర్జ్యోతి రమేయ మేక మమృతం
కృష్ణాఖ్య మాపీయతాం
తత్పీతం పరమౌషధం వితనుతే నిర్వాణ
మాత్యన్తికం

సీ॥ జనులార! వినుడిది జనన క్షయములను
వ్యాధి నిర్మూలింప 'మందు' కలదు
యాజ్ఞవల్క్యుండాది అనుభవజ్ఞులు మున్ను
తెలిపిన వైద్యము దెలుపుచుంటి
అప్రమేయంబైన ఆ పరంజ్యోతియన్
అమృతమొక్కటే ఆదుకొనును
శ్రీకృష్ణుడని దాని చెప్పిరి వర్ణించి
పేరు నాల్కను నిల్ప పేర్మి కలుగు

తే॥ దాని పానము జేయుడు తనివిదీర
నిరవధికమైన సుఖప్రాప్తి నెరుగగలరు
అట్టి సౌఖ్యము నొసగెడి ఆ ముకుందు
నామమొక్కటే ఔషధంబమరు ముక్తి.

తా॥ ఓ ప్రజలారా! వినండి. చావు పుట్టుకల వల్ల పీడించబడుతున్నామని భయపడకండి. దానికి ఒక చక్కటి మందు కనిపెట్టబడింది. యాజ్ఞ వల్క్యుడు మొదలైన మహా మునులు, అనుభవజ్ఞులు తెలిపిన ఆ ఔషధం (మందు) గురించి మీరూ తెలుసుకోండి. అప్రమేయమైన ఆ పరంజ్యోతి అను అమృతం ఒక్కటే మిమ్మల్ని కాపాడగలదు. ఆ మహానుభావులంతా దానిని వర్ణించి ప్రేమగా ఆ 'మందు' పేరు శ్రీకృష్ణుడు అని చెప్పారు. దానిని తనివి తీరా త్రాగండి.



నిరాటంకమైన సుఖం కలుగుతుంది. గొప్ప సౌఖ్యమునీయగల ఆ ముకుందుని నామమొక్కటే దివ్యౌషధము. మీకు ముక్తి (వ్యాధి నిర్మూలన) నిస్తుంది.

## అవతారిక 19 :

భవ సాగర కెరటాలలో మునిగిపోయి దుఃఖించే వారికి ఒక దివ్య మంత్రోపదేశం చేస్తున్నారు కులశేఖరులు. భవతారకమైన దాని పేరే "ఓం నమో నారాయణాయ" ఆ మంత్రాన్ని ప్రతి దినమూ, ప్రతిక్షణమూ ఆలపిస్తూనేవుండాలి అంటున్నారు. ఆ మంత్రం కన్నా వేరే దారిలేదు.



శ్లో॥ హే మర్త్యాః పరమం హితం శ్రుణుత వో
వక్ష్యామి సంక్షేపతః
సంసారార్ణవ మాపదూర్మి బహుళం సమ్య
క్ప్రవిశ్యస్థితాః
నానాజ్ఞాన మపాస్య చేతసి నమో నారాయణా
యే త్యముం
మంత్రం సప్రణవం ప్రణామ సహితం ప్రావర్త
యధ్వం ముహుః

సీ॥ నరులార! 'ఆపద కెరటాలు' ముంచెత్తు
భవ సాగరంబున పడుచు మునిగి
వెతచెందు మీకొక్క హితవు వచించెద
సంక్షేపముగ నేడు సాధులార!
భేద దృష్టిని మీరు విడనాడి అనరేల?
ఆ 'నమో నారాయణ'నెడి గొప్ప
మంత్రంబు పలుకుడు మంగళకరమది
ఓం కార సహితమై ఒప్పు చుండ



తే॥ మాటి మాటికి పలుకుడు మాట వినుడు,
నిత్య మద్దాని పలికిన నెనరు తోడ
విష్ణు వందన మది మీకు వెతలు బాపి
బ్రోచు, హరికి సాటెవ్వరు భువనమందు

తా॥ ఓ మానవులారా! ఆపదలనే కెరటాలు నిత్యమూ ముంచెత్తునట్టి భవ సాగరంలో మునిగిపోతూ దుఃఖిస్తున్న మీరు ఒక హితకరమైన సలహాను సంక్షిప్తంగా వినండి. భేద దృష్టిని విడిచిపెట్టి మీరెందుకు 'ఓం నమో నారాయణాయ' అను మహా మంత్రమును ఓంకార సహితంగా మంగళకరమై పలుకరు? దానిని ఆశ్రయించండి. నామాట వినండి. ఆ మంత్రాన్ని మాటి మాటికీ పలకండి. ప్రేమతో దానిని నిత్యమూ స్మరిస్తే ఆ విష్ణువందనము మీకు బాధా నివారణ కలుగజేసి కాపాడుతుంది. శ్రీహరికి ఈ విషయంలో సాటిలేరు.

## అవతారిక 20 :

సముత్కర్షమైన రీతిగా ఆ శ్రీమన్నారాయణుని దివ్య విభూతిని వర్ణిస్తున్నారు కులశేఖరులు. పరమాద్భుతమైన ఈ శ్లోకంలో ఆ ముకుందుని సర్వ వ్యాపకత్వం వర్ణిస్తున్నారు. మనం ఎంతో ఉత్కృష్టమని భావించే పంచ భూతాలు, బ్రహ్మాది దేవతలు ఎంతో శక్తిగల ఉన్నతమైనవి కావచ్చు కాని ఆ విశ్వ రూపునితో పోల్చినప్పుడు మాత్రం ఆయనకి సాటిరారు.

శ్లో॥ పృథ్వీ రేణు రణుః పయాంసి కణికాః ఫల్గు
స్ఫులింగో లఘుః
తేజో నిశ్వసనం మరుత్తనుతరం రంధ్రం
సుసూక్ష్మం నభః
క్షుద్రా రుద్ర పితామహ ప్రభృతయః
కీటాః సమస్తా స్సురాః
దృష్టే యత్ర స తావకో విజయతే
భూమావధూతావధిః



సీ॥ ఏనీ విభవముతో ఈ పృథ్వి బోల్చిన
ఒక రేణువై తోచు సకలమున్ను
సాగరంబంతయున్ సాధించి పోల్చిన
తను నీటి బిందువై కాననగును
అగ్ని మిణుగురులా అవుపించు నిజముగా
చిన్న నిట్టూర్పులా చెలగు గాలి
అవధులు లేనట్టి ఆకాశమంతయున్
అతి చిన్న రంధ్రమై అవతరించు

తే॥ బ్రహ్మ రుద్రులు దేవతల్ పరగుతాము
చిన్న పురుగుల వలె ప్రభూ! నిన్ను పోల్చ
అట్టి నీ అపారంబైన ఆ విభూతి
అది సముత్కర్షమౌ రీతి విదితమగును.

తా॥ ఓ ముకుందా! ఓ ప్రభూ! ఏ నీ దివ్య మహిమతో పోల్చి చూచిన ఈ భూమండలం ఒక చిన్న రేణువు వలె కనిపిస్తుందో, మహా సాగరం చిన్న నీటి బిందువులా ఉంటుందో, దారుణమైన అగ్ని



చిన్న మిణుగురులా కనిపిస్తుందో, గొప్ప సుడిగాలి చిన్న నిట్టూర్పువలె తోస్తుందో, అవధులు లేని ఆకాశం ఒక చిన్న రంధ్రంవలె తోస్తుందో, బ్రహ్మ, శంకరుడు మొదలైన దేవతలంతా చిన్న పురుగుల వలె కనిపిస్తారో, అట్టి అపారమైన నీ దివ్య విభూతి సముత్కర్షమైన రీతిగా తెలుస్తున్నది. సర్వ శ్రేష్ఠమైనదని కీర్తించబడుతున్నది.

## అవతారిక 21 :

పరమాత్మ విశ్వరూప దర్శనం సామాన్యులకు దుర్లభమైనప్పటికీ సాధ్యమైనంత తేలిక భాషలో వివరించిన కులశేఖరులు ఈ శ్లోకంలో అనన్య భక్తితో ఆ ముకుందుని సేవించి తరించే భాగ్యం, తనకిమ్మని వేడుకుంటున్నారు. ఆ దివ్యానందంలో తనలో జరిగే మార్పులు వర్ణిస్తున్నారు. దివ్య నామ సుధా రసపానమొనరించే భాగ్యం చాలని వేడుకుంటున్నారు.



శ్లో॥ బద్ధేనాంజలినా నతేన శిరసా గాత్రైస్స
రోమోద్గమైః
కంఠేన స్వరగద్గదేన నయనే నోద్గీర్ణ
బాష్పాంబునా
నిత్యం త్వచ్చరణారవింద యుగళ
ధ్యానామృతాస్వాదినాం
అస్మాకం సరసీరుహాక్ష! సతతం
సంపద్యతాం జీవితం

సీ॥ అంబుజలోచనా! అంజలి ఘటియింతు
అవనత శిరముతో అమిత భక్తి
గాత్రంబు పులకించి గగురు బాటును చెంద
గళము గద్గదమైన గతిని పొంద
ఆనంద భాష్పాలు ఆపక స్రవియించ
అక్షిద్వయము తాము అలరె స్వామి!
నీ పాద పద్మముల్ నిరతంబు ధ్యానించు
టను, సుధా రసమును ఆర్తితోడ

తే॥ పానమొనరించి మాయొక్క బ్రతుకులన్ని
నీదు ధ్యాసయే శ్వాసగా నెరపు రీతి
మేము గడిపెడు భాగ్యము మేలుకాదె?
మాకు వరమిమ్ము ఓ ప్రభూ! మధు విఘాతి!

తా॥ ఓ పద్మ నయనా! నీకు దోసిలి పట్టుకుని భక్తితో శిరస్సు వంచి, పులకించిన శరీరం గగుర్పాటు చెందగా, కంఠస్వరం గద్గదమై పోగా, ఆపలేని ఆనంద భాష్పాలను కన్నులు జలజలా స్రవిస్తుండగా, నీ పాద పద్మములను సదా ధ్యానించుట అనెడి మకరందమును ఆర్తితో త్రాగుచూ మా జీవితములను నీ ధ్యాసయే మాకు శ్వాసగా చేసుకుని గడుపునట్లుండు భాగ్యము కలుగుట మేలుకాదా? ఓ ప్రభూ! మధు సూదనా మాకట్టి వరమిమ్ము.



## అవతారిక 22 :

పరమాత్మకున్న అనంత నామాలలో వేయి నామాలు చదివితే మీ శక్తికి తగ్గ పని అని భీష్మాచార్యులవారు శ్రీకృష్ణునికి ద్వాపర యుగంలో విష్ణు నామ సహస్రం వినిపించారు. నేటికీ అది పారాయణ చేస్తూ కోట్లాది మంది పునీతులవుతున్నారు. కలియుగం నడుస్తున్న కొద్దీ 'ఆకలి' యుగం అయిపోయింది. మనకీ నామాలు చాలనుకుని కులశేఖరులు ఆ ముకుందుని ఈ విధంగా కీర్తిస్తున్నారు. శరణు వేడుతున్నారు.

శ్లో॥ హే గోపాలక! హే కృపా జలనిధే! హే సింధు
కన్యాపతే!
హే కంసాంతక! హే గజేంద్ర కరుణాపారీణ!
హే మాధవ!
హే రామానుజ! హే జగత్త్రయ గురో! హే
పుండరీకాక్ష! మాం
హే గోపీ జననాథ! పాలయ పరం జానామి
న త్వాం వినా॥



సీ॥ హే కృపా జలనిధీ! హే విభో! గోపాల!
హే సింధు కన్యకా హృదయపాల!
హేకంసభంజనా! హే గజేంద్ర వరద!
హే మాధవా! ప్రభో! హే ముకుంద!
హే బలరామానుజా! బలి గర్వహా!
హే జగత్రయ గురూ! హే మురారి!
హే పుండరీకాక్ష! హే గోపి జననాథ!
దయజూపి బ్రోవుమాదరికి జేర్చి

తే॥ నన్ను పాలించి రక్షించు సన్నుతింతు
నేను ఎరుగను అన్యము నీవు దక్క
కృష్ణ! కేశవా! ఓ స్వామి! కృపను గనుము
శరణు గోవింద! వల్లభా! శరణు శరణు.

తా॥ హే ప్రభూ! గోపాల! హే కరుణా సాగరా! పాలకడలి నుండి జన్మించిన లక్ష్మీ హృదయనాథా! హే కంసాంతకా! హే గజేంద్ర



వరదా! హే మాధవా ప్రభూ! హే ముకుందా! ఓ బలరాముని తమ్ముడా! హే త్రిలోక నాథా! ఓ మురారీ! హే పుండరీకాక్షా! హే గోపీనాథా! మమ్ము నీ దగ్గరకు చేర్చుకుని, దయజూపి రక్షించుము. నిన్ను ప్రార్థించెదను నన్ను కాపాడుము. నీవు తప్ప నేను ఇతరము లేవీ ఎరుగను. ఓ స్వామీ! కృష్ణా! కేశవా! కృపజూపుము. ఓ వల్లభా! శరణు ఓ గోవిందా! శరణు శరణు.

## అవతారిక 23 :

శ్రీకృష్ణ పరమాత్మను రకరకాల మణి సంపదగా వివరిస్తున్నారు. కులశేఖరులు భక్తుల ఆపదలనే సర్పాలకు గరుడమణి, ముల్లోకాలను రక్షించు దివ్యమణి అంటూ ఆగోపాల చూడామణిని అనేక మణులతో కీర్తించారు. వైవిధ్యంతో కూడిన ఈ ప్రార్థన ఆకర్షణీయంగా ఉంటుంది.

శ్లో॥ భక్తాపాయ భుజఙ్గ గారుడమణి
స్త్రైలోక్యరక్షామణి
గోపీలోచన చాతకామ్బుదమణి
స్సౌందర్య ముద్రామణిః
యః కాన్తామణి రుక్మిణీ ఘనకుచ
ద్వన్ద్వైక భూషామణిః
శ్రేయో దేవశిఖామణి ర్దిశతునో
గోపాల చూడామణిః

సీ॥ భక్తుల నాపదల్ పాములై బాధించ
పరిసమాప్తము జేయు గరుడమణియు,
త్రైలోక్య రక్షయౌ దివ్య మణియు స్వామి
సౌందర్యముద్ర నొసంగు మణియు
గోపీనయనములన్ గొప్ప చాతకముల
మేఘమై రంజించు మేటి మణియు
స్త్రీరత్నమైనట్టి ఆ రుక్మిణీ కాంత
ఘనకుచముల అలంకారమణియు



తే॥ ఎవడు గోపాల చూడామణెవడు తాను
దేవతల శిఖామణి వోలె దీప్తి చెందె
అట్టి దేవదేవుడు హరి ఆర్తి బాపు
యెంచి గమనించి మమ్ము రక్షించు గాక!

తా॥ భక్తులను ఆపదలు ఘోర సర్పములై బాధించు చుండగా కాపాడునట్టి గరుడమణియు, త్రిలోకములను రక్షించు బాధ్యత చేబట్టిన దివ్యమైన మణియు, సౌందర్యముద్రవలె శోభిల్లు మణియు, గోపికల కన్నులు అను చాతక పక్షులకు సంతోషము నొసగెడి మేఘ మణియు, స్త్రీలలో రత్నమైనట్టి ఆ రుక్మిణీ దేవి ఘనమైన స్తనద్వయమునకు అలంకారము నొసంగు మణియు, గోపాల చూడామణియు ఎవ్వరో, దేవతలకు వెలుగు నొసంగు శిఖామణి ఎవ్వరో అట్టి దేవదేవుడు, శ్రీహరి మా ఆర్తి దీర్చి మమ్ము యెంచి రక్షించు గాక.



## అవతారిక 24 :

సామాన్య మానవులంతా ఏదైనా ఒక మంత్రం నేర్చుకుని కామ్య ప్రాప్తి గోరుకుంటారు. తేలు మంత్రం లాంటివెన్నో అందుకే వెలుగులో కొచ్చాయి. కానీ శత్రు నిర్మూలనమే కాక శుభకరము కూడా అయిన మంత్రాన్ని ఎవరూ నేర్వలేదు. మన అదృష్టం కొద్దీ కులశేఖరులు ఆ మహామంత్రోపదేశం చేస్తున్నారు వినండి. వినరో భాగ్యము విష్ణు కథా.....

శ్లో॥ శత్రుచ్ఛేదైక మంత్రం సకల ముపనిషద్వాక్య
సంపూజ్య మంత్రం
సంసారోత్తార మంత్రం సముపచిత తమస్సంఘ
నిర్యాణ మంత్రం
సర్వైశ్వర్యైక మంత్రం వ్యసన భుజగ సందష్ట
సంత్రాణ మంత్రం
జిహ్వే! శ్రీకృష్ణ మంత్రం జపజప సతతం జన్మ
సాఫల్య మంత్రం



సీ॥ నాలుకా! పలుకవే నయమైన మంత్రము
శత్రు సంహారంబు జరుపు దాని
ఉపనిషత్ద్వారమై ఒప్పెడి మంత్రము
సంసార తాపంబు జంపు దాని
అజ్ఞాన తిమిరాల నణగించు మంత్రము
సర్వ శుభమ్ములన్ జరుపుదాని
వ్యసనంబులనబడు పాములు కాటేయ
కాపాడు మంత్రము ఘనము అదియె

తే॥ జన్మ సాఫల్యమొనరించు శక్తిగలది
మంత్ర మిద్దాని దెలియుడు మహిమ కలది
సతతమీ కృష్ణ మంత్రము జపము జేయ
విష్ణు కరుణచే జగములు వెలుగు గాక!

తా॥ ఓ నాలుకా! శత్రునిర్మూలనము జేయగల మేలైన మంత్రము ఉపనిషత్తుల సారముగా ఒప్పుచున్న మంత్రము, సంసార తాపత్రయములను తొలగించు మంత్రము, అజ్ఞానాంధకారమును పోద్రోలు

మంత్రము, సర్వ శుభప్రదమైన మంత్రము, కాటువేయునట్టి వ్యసనములను ఘోర సర్పములను అంతమొందించు ఘనమైన మంత్రము, జన్మ సఫలము చేయు శక్తిగల మంత్రము, అయిన ఈ శ్రీకృష్ణ మంత్రము మహిమగల దానిని తెలుసుకొని ఎల్లవేళలా జపించండి. ఆ విష్ణుమూర్తి కరుణచే జగములన్ని దీప్తి జెందుగాక.

## అవతారిక 25 :

ప్రపంచంలో ఎందరో పేరు పొందిన వైద్యులున్నారు. కానీ ఏమాత్రం ఖర్చులేక సులభంగా దొరికే ఔషధం, సర్వ రోగ నిర్మూలకం (శారీరక మానసిక రోగాలు) అయినది మాత్రం ఇదే. కులశేఖరులు స్వానుభవం రంగరించి తెలుసుకున్న దాన్ని మనందరికీ ఇస్తున్నారు. ఆ శ్రీకృష్ణామృతం రుచి చూడండి.



శ్లో॥ వ్యామోహ ప్రశమౌషధం మునిమనోవృత్తి
ప్రవృత్త్యౌషధం
దైత్యేంద్రార్తిక రౌషధం త్రిభువనీ
సంజీవనై కౌషధం
భక్తాత్యంత హితౌషధం భవభయ
ప్రధ్వంస నైకౌషధం
శ్రేయః ప్రాప్తిక రౌషధం పిబ మనః
శ్రీకృష్ణ దివ్యౌషధం

సీ॥ వ్యామోహ పాశమ్ము బట్టి ద్రెంచగ జాలు
అసలైనదీ గొప్ప ఔషధంబు
సతతంబు మునులకు సద్భావము నొసంగు
అరుదైనదీ మేటి ఔషధంబు
త్రైలోక్యములకెల్ల దివ్య సంజీవిని
అసురుల నణగించు ఔషధంబు
సంసార భయము ధ్వంసంబు జేయునదిదే
అలరించు భక్తుల ఔషధంబు



తే॥ అట్టి శ్రీకృష్ణుడను దివ్య ఔషధమును
శ్రేయమొనరించి కాపాడు శ్రేష్ఠమైన
దిదియె సేవింపవేలనే హితము గలుగ
ఓ మనస్సా! ఇదే నీకు ఒసగు ముక్తి

తా॥ ఓ మానసమా! నీకు ముక్తి నొసగే గొప్ప ఔషధమును తెలుపుచున్నాను వినుము. వ్యామోహమను బలమైన పాశమును త్రెంచగల గొప్ప ఔషధము ఇదియే. మహామునులకు సైతము ఎప్పుడూ సద్భావము నిచ్చు ఔషధము ఇదే. ముల్లోకములయందును దివ్య సంజీవనీ ఔషధం ఇదే. (సంజీవిని చనిపోయిన వారిని బ్రతికిస్తుంది). అసురులను నిర్మూలించు ఔషధం సంసార తాపత్రయముల వేదన తొలగించి, భక్తులకు సంతోషము కలిగించు శ్రేష్ఠమైన ఔషధము ఇదే అట్టి శ్రీకృష్ణుడు అను దివ్యమైన



ఔషధము సేమము నొసంగి కాపాడు శ్రేష్ఠమైన ఔషధము. ప్రీతితో దీనిని సేవించుము, మేలు కలుగుతుంది.

## అవతారిక 26 :

మానవులు చేసే వేద పఠనం కాని, వ్రతం కాని, విహిత కర్మలు కాని, పుణ్య తీర్థ స్నానాలు కాని, ఆది దేవుడైన శ్రీమన్నారాయణుని ప్రీతికోసమే. అట్లుగాక అవన్నీ నిరర్థకం అంటున్నారు కులశేఖరులు. చాలామందికి సుపరిచితం కాని కరిస్నానం గురించి ప్రస్తావించారు. ఏనుగు చక్కగా స్నానం చేసి తర్వాత తొండంతో మళ్ళీ శరీరంపై మట్టి చిమ్ముకొంటుందిట. విచిత్రం కదా!

శ్లో॥ అమ్నాయాభ్యసనా న్యరణ్య రుదితం వేదవ్రతా
న్యన్వహం
మేదశ్ఛేద ఫలాని పూర్తవిధయః సర్వే
హుతం భస్మని
తీర్థానా మవగాహనాని చ గజ స్నానం
వినా యత్పద
ద్వంద్వాంభోరుహ సంస్మృతిం విజయతే
దేవస్స నారాయణః

సీ॥ ఏ స్వామి పదపద్మ మీప్సితమ్ముగ సేవ
జేయక అన్యము జేయునెడల
వేద పఠన కూడ విలువలేనట్టిదై
అడవి రోదనవలె వ్యర్థమవును
వ్రతమేమి చేసినా వ్యర్థంబు, కొవ్వును
కరగించు నంతియే కడకు శ్రమయె
విదిత కర్మలు కూడ వెలయక అగ్నితో
బూదిలో హోమమ్మె కుదురు కొనును



తే॥ పుణ్య తీర్థాల స్నానమున్ పోల్చవచ్చు
అదియు కరి స్నానమును బోలి వ్యర్థమగును
అట్టి నారాయణుడు హరి ఆదిదేవు
డతడు విజయుడై వెలుగొందు ఆర్తి దీర్ప.

తా॥ ఏ భగవంతుని పాద పద్మముల నిరంతర సేవ కోర్కెలు దీర చేయక అన్యముగా చేసిన యెడల వేద పఠనము కూడ విలువలేని అరణ్యరోదనముగా మిగిలి పోతుందో, వ్రతమేది చేసినా వ్యర్థమై శ్రమచే కొవ్వు కరిగిపోయి చివరకు ఆయాసం మిగులుతుందో, ఇష్టాపూర్తి కర్మలన్నియునూ అగ్ని లేక బూడిద మాత్రమే మిగిలిన హోమకుండంలో చేసే హోమమవుతుందో, పుణ్య తీర్థ స్నానము చేసినా ఏనుగు స్నానంలా నిరుపయోగమే అవుతుందో, (ఏనుగు చక్కగా స్నానం చేసి వెంటనే శరీరంపై మట్టి చిమ్ముకుంటుంది) అట్టి ఆదిదేవుడైన



శ్రీమన్నారాయణుడు, శ్రీహరి నిరంతర ధ్యానమే మన బాధలను నివారించుటకు ఉపకరించును.

## అవతారిక 27 :

ఈ శ్లోకంలో కులశేఖరులు శ్రీహరి నామోచ్చరణ, చేయని నాలుకను మందలిస్తున్నారు. అదిచేసిన నేరానికి తనకి మళ్ళీ ఇంకొక జన్మ, గర్భవాస నరక ప్రాప్తి, దుఃఖం తప్పవని వేదన చెందుతున్నారు.

శ్లో॥ శ్రీమన్నామ ప్రోచ్య నారాయణాఖ్యం
కే నప్రాపుః వాంఛితం పాపినో పి
హా! నః పూర్వం వాక్ప్రవృత్తా న తస్మిన్
తేన ప్రాప్తం గర్భవాసాది దుఃఖమ్



ఉ॥ చేకొని ఎంత పాపియును చేసిన కీర్తన
విష్ణు నామమున్
ఈకడనుచ్చరించి తరియించక నుండుట కాదు,
నాలుకా!
హా! కడకొక్కసారి గొని ఆ ఘను నామము
పల్కవైతివే
నాకిక జన్మ తప్పదుగ, నల్గుచు గర్భ నివాస
దుఃఖమున్

తా॥ సాధించి ఎంత పాపాత్ముడైనా విష్ణు నామమును ఇప్పుడు ఉచ్ఛరించి, తరించకుండా ఉండడం సాధ్యం కాదు. అయ్యో! చివరకు ఒక్కసారి ప్రయత్నించి ఆ శ్రేష్ఠుని నామధేయమును ఓ నాలుకా! శ్రీహరీ అనకపోతివే. అందులకే నాకు జన్మనొంది బాధపడుతూ గర్భవాసమున నుండి దుఃఖము కలిగినది.

## అవతారిక 28 :

ఈ శ్లోకంలో కులశేఖరులు మధుకైట భారి అయిన శ్రీహరిని తనకోర్కె తీర్చమని అభ్యర్థిస్తున్నారు. తన వింత కోరిక వినండి. తనని శ్రీమన్నారాయణుని యొక్క భృత్యులకు దాసులకు, దాసులకు, దాసులకు, దాసుడిగా అనుగ్రహించమని వేడుకుంటున్నారు. ఇదండీ శరణాగతి అంటే.

శ్లో॥ మజ్జన్మనః ఫలమిదం మధు కైటభారే
మత్ప్రార్థనీయ మదనుగ్రహ ఏష ఏవ
త్వద్భృత్య భృత్య పరిచారక భృత్యభృత్య
భృత్యస్య భృత్య ఇతి మాం స్మర లోకనాథ!



ఉ॥ నిత్యము నా అభీష్టమును నీవొనగూర్పుము
నీ కృపార్ధురిన్
అత్యధికంబుగా కురియనంపుము ఓ
మధుకైటభారి! నే
సత్యము జెప్పుచుంటినిది చాలును ఎంచుము
ఓ జగత్పతీ!
భృత్యుల దాస సేవకుల భృత్యుల దాసుల
దాసదాసుడన్.

తా॥ ఓ మధుకైటభవైరీ! నా ఇష్టమైన కోరికను నాకు అనుగ్రహింపుము. నీ కరుణాతరంగములు నాపై అమితంగా కురిపింపుము. ఓ జగన్నాధా నిజం చెబుతున్నాను. నన్ను నీవు నీ భృత్యులకు దాసులైన భృత్యులకు దాసులైన దాసులకు దాసునిగా పరిగణించిన చాలును. నా జన్మ తరించిందని భావిస్తాను.



## అవతారిక 29 :

జగాల ఏలికయైన పురుషోత్తముని ఆశ్రయించక ఆర్థిక లబ్ధి కోసం రాజుల కాళ్ళు పట్టుకొని చిన్న చిన్న లాభాల కోసం హరి పాదసేవకు దూరమై దిక్కుమాలిన దాస్యం చేసే మూఢుల్ని తలిచి విచారిస్తున్నారు కులశేఖరులు. 'బాల రసాల సాల నవపల్లవ కోమల కావ్య కన్యకన్.....' అని దుఃఖించిన బమ్మెర పోతనని స్ఫురింప చేస్తోంది ఈ శ్లోకం.

శ్లో॥ నాథే నః పురుషోత్తమే త్రిజగతా మేకాధిపే
చేతసా
సేవ్యే స్వస్య పదస్య దాతరి సురే
నారయణే తిష్ఠతి
యం కంచి త్పురుషాధమం కతిపయ గ్రామేశ
మల్పార్థదం
సేవాయై మృగయామహే నర మహో మూఢా
వరాకావయం



సీ॥ పురుషోత్తముడు, మననుద్ధరించు ప్రభువు
ముల్లోకముల 'పతి', యుల్లమందు
సేవింపదగువాడు, చేరి స్వస్థానమ్ము
లబ్ధి పొందించు నారాయణుండు
ఏలంగనతడుండ ఏ బంధమూలేని
కర్మేమి? అధికొర బట్ట
మానవాధంబుల మానవ మాత్రుల
అల్ప ఫలంబుకై ఆశపడుచు

తే॥ వారి సేవించ నాత్రము పడెదమిట్లు
అయ్యయో! ఏమి అజ్ఞానమయ్యలార!
ఏమి నీచత్వ మిదియెల్ల ఏమి దిక్కు
మాలినటువంటి దాస్య జీవనము జూడ

తా॥ మనందరిని ఉద్ధరించు ప్రభువు ఆ పురుషోత్తముడు, త్రిజగన్నాధుడు మనసున నిలుపుకొని సేవించదగినవాడు, మన అసలైన స్వస్థలమును (హరి పాద పద్మములు) పొందు భాగ్యము కలిగించువాడు ఆ శ్రీమన్నారాయణుడు. మనని పాలించుటకు ఆ స్వామి ఉండగా, ఏ సంబంధమూ లేని గ్రామాధికారులను (చిన్న అధికారులను) సేవించే కర్మ ఏమిటి? మానవాధములను, మానవ మాత్రులను చిన్న చిన్న ఫలితాల కోసం ఆశపడుతూ వారిని సేవించుటకు ఎందుకు ఈ విధంగా ఆరాట పడుతున్నాం? అయ్యయ్యో! అయ్యలారా! ఏమిటీ అజ్ఞానం! ఇది ఏమి నీచత్వం. చూడగా ఏమిటీ దిక్కు మాలిన దాస్య జీవనం!



## అవతారిక 30 :

మన్మధుణ్ణి హెచ్చరిస్తున్నారు కులశేఖరులు. హృదయంలో హరిని నిలుపుకున్న తనదగ్గరకు రానే రావద్దని హెచ్చరిస్తున్నారు. వెనకటికి శివుని మీద తన ప్రతాపం చూపించబోయి బూడిదైపోయావు. ఆ శంకరుడు పూజించే శ్రీమహావిష్ణువుయొక్క భక్తుల జోలికి వస్తే జాగ్రత్త! అని హెచ్చరిస్తున్నారు.

శ్లో॥ మదన పరిహార స్థితిం మదీయే
మనసి ముకుంద పదారవింద ధామ్ని
హర నయన కృశానునా కృశోసి
స్మరసి న చక్ర పరాక్రమం మురారేః



చం॥ మదనుడ! నాహృదిన్ నిలిచె మాధవ పాద
సరోరుహంబులున్
పదిలమదైన రీతి, విను, వద్దుర చేరకు
రాకు మిచ్చటన్
వదలక బూదిజేసె నిను పన్నగ భూషణు,
డందుచేత, నీ
మది హరి చక్రమున్ దలచి మంచిగ నుండుము
ఇంకనైననున్

తా॥ ఓ మన్మధుడా! వినుము. భద్రంగా నా హృదయంలో మాధవుని పాదపద్మములు నిలిచి యున్నాయి. నువ్వు దాంట్లోకి రావద్దు. ఎందుకంటే ఇది వరకొకసారి నాగభూషణుడైన శివుడు నిన్ను విడువక (తనపై నీ పుష్ప బాణములు వేశావని) బూడిద చేశాడు. నీ



మనస్సులో ఆ శ్రీహరి సుదర్శన చక్రం ఎటువంటిదో ఆలోచించి ఇకనైనా బుద్ధిమంతుడిలా ఉండు. (ఆ సదాశివుణ్ణే ఎన్నోసార్లు కాపాడిన శ్రీహరి భక్తులతో పెట్టుకోకు)

## అవతారిక 31 :

తన నాలుకకు నమస్కరించి ప్రాధేయపడుతున్నారు కులశేఖరులు. ఎంతోమంది శ్రేష్ఠులు ఆ శ్రీహరి నామం నీ మేలుకోరి సమకూరిస్తే మాటిమాటికీ ఆశ్రీహరి నామం పలుకవేమే? అని మందలిస్తున్నారు.

శ్లో॥ తత్త్వం బ్రువాణాని పరం పరస్మా
న్మధుక్షరం తీవ సతాం ఫలాని
ప్రావర్తయ ప్రాంజలి రస్మి జిహ్వే!
నామాని నారాయణ గోచరాణి

ఉ॥ నీకు నమస్కరించి ఇటు నీకు హితంబును
'జిహ్వా!' చెప్పెదన్
ఆ కరుణాంతరంగుడగు ఆ పరమాత్ముని యెంచి
శ్రేష్ఠులున్
తేకొని అమృతంబొలుకు దివ్య ఫలంబులనీయు
నామముల్
నీకొనగూర్చిరే! హరిని నీవు స్మరింపుము మాటి
మాటికిన్

తా॥ ఓ నాలుకా! నేను నీకు నమస్కరించి హితవుకలిగించే విషయం చెబుతాను. ఆ కరుణాంతరంగుడైన ఆ పరమాత్ముడు శ్రీహరిని నమ్ముకొని మహానుభావులు అమృత మొలుకునవి, దివ్యమైన ఫలితములిచ్చు నామములు నీకు అందించారు కదా! ప్రేమతో ఆ స్వామిని స్మరించి మాటి మాటికీ వాటిని పలుకుము.



## అవతారిక 32 :

మానవులు 'తమవి' అని మురిసిపోయేవన్నీ అశాశ్వతమైనవే. శరీరం, ఎముకలు, కీళ్ళు అన్నీ పటుత్వం కోల్పోయి మందులు మింగుతూ జీవించాల్సిందే. మరెందుకు నందనందనుడైన, శ్రీకృష్ణుని శరణు బొందవంటున్నారు కులశేఖరులు.

శ్లో॥ ఇదం శరీరం పరిణామ పేశలం
పతత్యవశ్యం శ్లథ సంధి జర్జరం
కిమౌషధైః క్లిశ్యసి మూఢ దుర్మతే
నిరామయం కృష్ణ రసాయనం పిబ

చం॥ క్రమముగ జీర్ణమయ్యెడిదె కాయము, కీళ్ళును
పట్టుదప్పురా,
తమిగొను ఔషదంబులతొ తప్పదు హానియు,
ఎందుకీ వృథా



శ్రమయిది, మూర్ఖుడా! ఘనుని చక్కటి నామ
రసాయనమ్ము పా
నము నొనరించి ఒక్క పరి నమ్మిక బిల్వుము
నందనందనున్

తా॥ ఈ మానవ దేహం క్రమంగా శిథిలమౌతూ నశించేదే. కీళ్ళు పట్టు తప్పుతవి. విపరీతంగా తీసుకునే మందులతో కీడు తప్పదు కదా!. ఓ మూర్ఖుడా! ఎందుకీ వృథా శ్రమ? ఘనుడైన ఆ శ్రీహరి చక్కటి నామరసాయనమును పానము చేయుము. ఒక్కసారి నమ్మికతో ఆ నంద నందనుని పిలువుము.

## అవతారిక 33 :

మనం ఎవరినన్నా గొప్పవారిగా పరిగణించడానికి వాళ్ళ ఆస్థిపాస్థులు, పలుకుబడి, పరివారం చూసి అంచనా వేస్తాం. కులశేఖరులు లోక సహజమైన ఆ



భావన ఆధారంగా ఆ ముకుందుని పరివారం వివరాలు చెబుతున్నారు. ఆలకించండి.

శ్లో॥
దారా వారాకర వరసుతా తే తనూజో విరించిః
స్తోతా వేద స్తవ సురగణో భృత్యవర్గః ప్రసాదః
ముక్తి ర్మాయా జగదవికలం తావకీ దేవకీ తే
మాతా మిత్రం బలరిపుసుతః త్వయ్యతోన్యం నజానే

సీ॥ భార్య సాగరకన్య పద్మజ శ్రీలక్ష్మి
నాలుగు మోముల 'నలువ' సుతుడు
అనిమేషులందరు నినుగొల్చు దాసులు
వేదంబులన్నినిన్ వినుతి జేయు
ఈ మూడు లోకాలు నీమాయ, నీ సృష్టి
ముక్తినీవిచ్చేటి మూలధనము

దేవకి నీ మాతృదేవత, ఇంద్రుని
సుతుడు నీమిత్రుడు అతడె క్రీడి.

తే॥ నీకు సరిబోలు దైవము నేనెరుగను
నిన్ను మించిన ఉత్కృష్టునెన్న గలరె?
హే ముకుందా? అదెన్నడు ఎరుక కాదు
నిజము పలికెద ఓ ప్రభూ! నిజము నిజము

తా॥ ఓ ముకుందా! నీ భార్య సాగరుని పుత్రిక, (పద్మజ) అయిన శ్రీలక్ష్మి. కుమారుడు అందరి విధిని నిర్దేశించి సృష్టి బాధ్యత చేపట్టిన బ్రహ్మ. నీ సేవకులు రెప్ప కూడా వాల్చకుండా ఎప్పుడూ నిన్ను సేవించే దేవతలు. వేదాలన్నీ నీ స్తోత్ర పాఠాలు వల్లె వేస్తాయి. ఇక ఈ ముల్లోకాలు నీ మాయా సృష్టియే. మోక్షం నువ్వొక్కడివి మాత్రమే



ఈయగల మూలధనము. నీ మాతృమూర్తి కష్ట సుఖాలు సమంగా అనుభవించిన ఆ దేవకీ దేవి. నీ మిత్రుడు ఇంద్రుని పుత్రుడైన అర్జునుడు. నీతో సమానమైన దైవాన్ని నేనెరుగను. నిన్ను మించిన సర్వశ్రేష్ఠుని కనుగొన అసాధ్యం కదా. ఓ ప్రభూ! నేను చెప్పేది ముమ్మాటికీ నిజం.

## అవతారిక 34 :

మనకి అవయవాలవలె భాషకి విభక్తులు అవసరం. మీ సంపద అపారం మిత్రమా! అంటే మీయొక్క సంపద అని అర్థం. ప్రథమ, ద్వితీయ, తృతీయ.... మొదలైన ఏడు విభక్తులే కాక సంబోధన ప్రథమావిభక్తి అని ఎనిమిదవది కూడ ఉంది. ఈ విభక్తులన్నీ ఒకదాని తరువాత ఇంకొకటి వచ్చేట్లు శ్రీకృష్ణుని ఎలా కీర్తిస్తున్నారో చూడండి మన కులశేఖరులు.



శ్లో॥ కృష్ణో రక్షతు నో జగత్త్రయ గురుః కృష్ణం
సమస్యామ్యహం
కృష్ణే నామర శత్రవో వినిహతాః కృష్ణాయ
తస్మై నమః
కృష్ణా దేవ సముత్థితం జగదిదం కృష్ణస్య
దాసో స్మ్యహం
కృష్ణే తిష్ఠతి సర్వమేత దఖిలం
హేకృష్ణ రక్షస్వమాం

సీ॥ కృష్ణుండు లోకాల కృపగొని రక్షించు
కృష్ణుని వేడెదన్ కేలు బట్టి
ఆ కృష్ణుచేనాడు అసురులంతంబైరి
శ్రీకృష్ణుకొఱకె నేచేతు వినతి
ఆ కృష్ణువలన తానలరారె విశ్వంబు
ఆవిర్భవించుచు అర్ణవమున
నేను కృష్ణునియొక్క నిరుపమానంబైన
దాసుండ వేడెద తనకు మ్రొక్కి



తే॥ అలరె భువనాలు కృష్ణుని యందె నిలచి
శరణు ఓ కృష్ణ! మాకీవె పరమ గతివి
ఈ విభక్తులనుతియింతు దేవతలకు
గురుని, శ్రీకాంతు, భక్తైక వరదు నిపుడు

తా॥ విభక్తులు ఏడు. వీటిని మనం నిత్యం సందర్భాన్ని బట్టి భాషలో వాడుతుంటాం. ఈ అద్భుతమైన శ్రీకృష్ణ స్తుతిలో కవి శ్రేష్ఠుడు కులశేఖరుడు ఆ పరమాత్మని విభక్తులనుపయోగించి భక్తితో ఎలా శరణు వేడుతున్నాడో గమనించండి. ఆనందించి పులకించండి. శ్రీకృష్ణుడు లోకాలను దయబూని రక్షించును. కనుక నేను ఆ శ్రీకృష్ణుని చేతులు పట్టుకుని వేడుకుంటాను. ఆ శ్రీకృష్ణునిచే రాక్షసులంతా మున్ను అంతమయ్యారు. అందుకని ఆకృష్ణుని కొఱకు నేను విన్నపం చేసుకుంటున్నాను. మహా సముద్రంలో పుట్టి

ప్రపంచమంతా ఆ శ్రీకృష్ణుని వలన వర్ధిల్లుతున్నది. నేను ఆ శ్రీకృష్ణునియొక్క సరిలేని దాసుండను. ఈ లోకాలన్నీ ఆకృష్ణునియందు వర్ధిల్లుతున్నవి. దేవతలకు గురువు శ్రీదేవి భర్త, భక్తులకు ఏకైక రక్షకా! శరణు. ఓ శ్రీకృష్ణా! శరణు శరణు.

## అవతారిక 35 :

తనని ఆదుకోవటానికి పరమాత్మయైన పురుషోత్తముడు తప్ప వేరెవరైన అశక్తులే అని నొక్కి వక్కాణిస్తున్నారు కులశేఖరులు.

శ్లో॥ తత్త్వం ప్రసీద భగవన్ కురు మయ్య నాథే
విష్ణో కృపాం పరమ కారుణికః కిల త్వమ్
సంసార సాగర నిమగ్న మనన్త దీన
ముద్ధర్తు మర్హసి హరే పురుషోత్తమో ని



ఉ॥ హే పరమాత్మ! నేను గననిందర నా సరియౌ
అనాథ నే
నాపయిజూపు నీదయ, అనంతుడవీవు
దయాళువో ప్రభూ
నేపడి, క్రుంగుచుంటి భవనీరవమందున
నుద్ధరింపనన్
తోపదు ఒక్కడైన సరితూగడు ఓ పురుషోత్తమా
కనన్

తా॥ ఓ పరమాత్మా! నాతో సరిపోల్చగల అనాధను ఇంత మందిలో నేను చూడను. నాపై నీదయ జూపుము. అనంతుడవు. ప్రభూ! దయాళూ! భవ సాగరములో పడినేను దుఃఖించుచున్నాను. నన్ను ఉద్ధరింపుము ఓ పురుషోత్తమా! నీతో జతగా ఒక్కడైనా సరితూగడు.



## అవతారిక 36 :

ఒక్కసారి నారాయణా! అని పిలిచి ఆ పిలుపు తన కుమారుని కోసం అయినప్పటికీ అంత్య కాలంలో చేశాడు కాబట్టి విష్ణు సాయుజ్యం చెందాడు అజామీళుడు. చనిపోయేప్పుడు సాధ్యం కాదేమోనని ఇప్పట్నించే సాధ్యమైనన్నిసార్లు "నారాయణ" అని అనటం అలవాటు చేసుకోవాలి. కులశేఖరునితో బాటు నారాయణ మంత్రోచ్చారణ చేద్దాం.

శ్లో॥ నమామి నారాయణ పాదపంకజం
కరోమి నారాయణ పూజనం సదా
వదామి నారాయణ నామ నిర్మలం
స్మరామి నారాయణ తత్త్వ మవ్యయం



శా॥ శ్రీనారాయణు పాద పద్మములకున్ చేతున్
నమస్కారముల్
ఆ నారాయణు నమ్ముచున్ మదినినేనర్చించి
పూజించెదన్
ఆ నారాయణు దివ్య నామములు నేనార్తుండనై
పల్కెదన్
ఆ నారాయణు తత్త్వమవ్యయముగా ఆత్మన్
స్మరింతున్ సదా.

తా॥ శ్రీమన్నారాయణుని పాద పద్మములకు నేను నమస్కరించెద. నారాయణుని మదిలో నమ్ముచు నేను అర్చించి పూజించెదను. ఆ నారాయణుని నిర్మలమయిన నామములను పలికెదను. ఆ నారాయణుని తత్త్వము అవ్యయమైనదిగా ఆత్మలో స్మరింతును.

## అవతారిక 37 :

శ్రీకృష్ణ పరమాత్ముని వివిధ నామాలతో కీర్తించక మానవులు ఎంత అజ్ఞానులై వ్యసనాల పాలబడి చెడిపోతున్నారని బాధ పడుతున్నారు కులశేఖరులు.

శ్లో॥ శ్రీనాథ! నారాయణ! వాసుదేవ!
శ్రీకృష్ణ! భక్తప్రియ! చక్రపాణే!
శ్రీపద్మనాభాచ్యుత! కైటభారే!
శ్రీరామ! పద్మాక్ష! హరే! మురారే!
అనంత! వైకుంఠ! ముకుంద! కృష్ణ!
గోవింద! దామోదర! మాధవేతి!
వక్తుం సమర్థోపి న వక్తి కశ్చిత్
అహో జనానాం వ్యసనాభి ముఖ్యం



సీ॥ వాసుదేవా! చక్రపాణి! హే శ్రీనాథ!
భక్తప్రియా! కృష్ణ! పద్మనాభ!
నారాయణా! హరీ! శ్రీరామ! గోవింద!
కైటభదైత్యుని కఠినవైరి!
పద్మాక్ష! మాధవా! వైకుంఠ! శ్రీకృష్ణ
దామోదరా! ప్రభూ! హే ముకుంద!
హే మురాసురవైరి! హే అనంతా! స్వామి!
ఈ విధంబుగ బిల్వ నెవ్వడైన

తే॥ ఒక్కడేని సమర్థుడు ఓ దయాళు!
నాకు కనిపించడేలనో నయము మీర
అయ్యో! జనులెంత వ్యసనాల అణగువారు
వెంట తిరుగాడుచున్నారు వెర్రులెత్తి



తా॥ ఓ శ్రీనాథా! వాసుదేవా! చక్రపాణి! భక్తప్రియా! నల్లనయ్యా! పద్మనాభా! నారాయణా! శ్రీహరీ! శ్రీరామా! గోవిందా! కైటభవైరీ! వైకుంఠా! పద్మాక్షా! శ్రీకృష్ణా! మాధవా! దామోదరా! ఓప్రభూ! ముకుందా! అనంతా! మురారీ! ఓస్వామీ! ఈ విధంగా వేయి నామాలున్న నిన్ను ఒక్క నామంతోనైనా పిలిచే సమర్థుడు నాకు కనిపించడేల? అయ్యయ్యో! వెర్రివాళ్ళైన ప్రజలు ఎంత ఘోర వ్యసనాలలో చిక్కుకుని ఆశాపాశం విడువక నలిగిపోతున్నారు! ఓ దయాళూ! రక్షించు.

## అవతారిక 38 :

హృదయ కమలంలో శ్రీహరిని స్థిరంగా నిలిపిన ధన్యాత్ములకు మోక్షప్రాప్తి ఎంత సుగమమో చెబుతున్నారు కులశేఖరులు.



శ్లో॥ ధ్యాయన్తి యే విష్ణు మనంత మవ్యయం
హృత్పద్మ మధ్యే సతతం వ్యవస్థితం
సమాహితానాం సత తాభయప్రదం
తే యాన్తి సిద్ధిం పరమాం చ వైష్ణవీం

చం॥ నిరతము హృత్సరోజమున నిండినవాడును, ఎల్లవేళలన్
వరదుడు ధ్యానమందుగలవారికి సేమమొసంగు విష్ణుకున్
ఎరుగుట ఆది అంతములు ఎన్నడు సాధ్యము కాని పూర్వుడౌ
మురహరి ధ్యానమున్ సలిపి మోక్షమునొందెద రా ప్రభు కృపన్

తా॥ ఎల్లప్పుడూ హృదయమనే పద్మమున నిండియున్న వాడును. ఎప్పుడు కాపాడు వాడని ధ్యానము చేయువారికి అభయమొసంగు వాడును, ఎన్నడూ ఆద్యంతముల నెరుగ సాధ్యం కాని వాడును సనాతనుడును శ్రీహరి అని ధ్యానించి ఆ విష్ణుమూర్తి కృపవల్ల మోక్షము పొందెదరు.

## అవతారిక 39 :

శ్రీమన్నారాయణుని కీర్తించి చిట్ట చివరిసారిగా వందన సమర్పణ చేస్తున్నారు కులశేఖరులు. ఇంతటితో ముకుందమాల పూర్తయింది. ఎందుకంటే ఆఖరిది, నలుబది యవది అయిన శ్లోకం కులశేఖరుని గురించి చెప్పునట్టి ముక్తాయింపు మాత్రమే.



శ్లో॥ క్షీరసాగర తరంగ శీకరా
సార తారకిత చారు మూర్తయే
భోగి భోగ శయనీయ శాయినే
మాధవాయ మధు విద్విషే నమః

ఉ॥ పాల సముద్రమందెగసి పడ్డతరంగపు
జల్లుతారలన్
బోలిన రీతిగా మెరసి ఉన్నతమౌ
గగనంబు తోపగా
నీలి నభంబు బోలు హరినేగొని పన్నగ
శాయినిన్ రమా
బాలమనోహరున్ గొలుతు వందనముల్
మధువైరికిన్ ఇవే.



తా॥ క్షీర సాగరమున ఉవ్వెత్తుగా ఎగిసిపడే అలలయొక్క జల్లు నక్షత్రముల వలె ఉన్నత గగన వీధిలో కనిపిస్తుండగా నీలాకాశపు దేహచ్ఛాయ ఆశ్రీహరిని శేషశయనుని లక్ష్మీదేవి మనస్సు హరించిన మనోహరుని మధు అనే రాక్షసుని శత్రువైన ఆ శ్రీమహా విష్ణువుకు ఇవేనా నమస్కారములు.

## అవతారిక 40 :

శ్రీహరి పాదపద్మములపై మరులు గొన్న తుమ్మెద వంటి కులశేఖరులు తన గురువు లిరువురని చెప్పి వారికి నమస్కరించి, మాధవుని స్మరించి ముకుందమాలకి ముగింపు పలుకబోతున్నారు.



శ్లో॥ యస్య ప్రియౌ శ్రుతిధరౌ కవిలోక వీరౌ
మిత్రే ద్విజన్మవర పద్మశరావభూతాం
తేనాంబుజాక్ష చరణాంబుజ షట్పదేన
రాజ్ఞా కృతాకృతి రియం కులశేఖరేణ

చం॥ శ్రుతి ధరులున్, కవీశ్వరులు శోభిల,
పద్మశరుండు కూడగా
ధృతిగల ఆ ద్విజన్మునితో, తెల్పుచు వారల
మిత్రులంచుతాన్
మతిగొని పద్మలోచనుని, మాధవు పాద
సరోరుహంబులన్
స్థితమగు తుమ్మెదైన 'కులశేఖరు' డీకృతి
తా రచించెగా

తా॥ వేద పారాయణములును, కవీశ్వరులునుయై శోభిల్లు నట్టి పద్మశరుడనబడు వానిని, రెండు జన్మలెత్తిన వానిని (నమ్మాళ్వారు మరియు వాల్మీకి మహర్షి) ఎవ్వరు మిత్రులుగా భావించు చున్నాడో, మనస్సు స్థిరపరచుకొని పద్మాక్షుడైన ఆ శ్రీహరిని పాద పద్మములలో నెలకొని యున్న తుమ్మెదవలె ప్రకాశించు కులశేఖరుడు తాను ఈ కృతిని రచించెను.



## మంగళం

మరలి మరలి జయ మంగళము
సొరిది నిచ్చలును శుభ మంగళము

కమలా రమణికి కమలాక్షునకును
మమతల జయ జయమంగళము
అమర జననికి అమర వంద్యునకు
సుముహూర్తముతో శుభమంగళము ॥మరలి॥

చిత్తజు తల్లికి శ్రీ వేంకటపతికి
మత్తిల్లిన జయ మంగళము
ఇత్తల నత్తల ఇరువురి కౌగిటి
జొత్తుల రతులకు శుభ మంగళము ॥మరలి॥

శ్రీ అన్నమాచార్యుల కీర్తన
రాగం : రామక్రియ



## నా మనవి

ఇది సంస్కృతమున శ్రీ కులశేఖర ఆళ్వార్‌చే రచించబడిన ముకుందమాల అను నలుబది శ్లోకములుగల సద్గ్రంథమునకు తెలుగు పద్యములలో రూపాంతరము చేసి ప్రతి శ్లోకమునకు అవతారిక మరియు ప్రతి పద్యమునకు తాత్పర్యము సమ్మేళనము చేయబడిన భగవన్నామ సంకీర్తన. కీ॥శే॥ అమరవాది రామకృష్ణయ్య మరియు సుబ్బమ్మల నోముల ఫలంగా 1947లో జన్మించిన అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు అని పిలువబడే నేను, శ్రీ సుందర చైతన్యానంద స్వామివారి రచనచే ప్రభావితం చేయబడి దీనిని రచించడం జరిగింది. ఈ పుస్తకం, ఈ విధంగా మీచేతుల్లో ఉండటానికి ఎందరో మహానుభావులు చేసిన కృషి అంతర్లీనమైయుంది. అందరికీ నా వందనములు. ఇటువంటి రచనలపై కుతూహలం వున్నవారు అనే నా వెబ్‌సైట్



కంప్యూటర్ ద్వారా సందర్శించి నా భగవదారాధనా యజ్ఞంలో మీరుకూడా పాల్గొని చరితార్థులవుదురు గాక.
ఓం సర్వేజనా సుఖినోభవన్తు

